

ఉష్ణోగ్రతలు గరిష్ఠం కనిష్ఠం 43.0 29.0



చంద్రబాబునాయుడుతో బీ ఫారాలు అందుకున్న టీడీపీ అభ్యర్థులు

ఇక దూసుకువెళ్లండి..!

మాట తప్పిన జగన్‌ను ఏకి పారేయండి

సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చెప్పండి

టీడీపీ అభ్యర్థులకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతిలో బీ ఫారాల అందజేత


అనంతపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోవాలని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభ్యర్థులకు సూచించారు. భేషజాలను వీడి, అందరినీ కలుపుకుని ముందుకు సాగాలని, గెలుపే లక్ష్యంగా పనిచేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్నందున.. రానున్న 20 రోజులు మరింతగా కష్టపడాలని అన్నారు. అమరావతిలో జిల్లాలోని పలు నియోజకవర్గాల పార్టీ అభ్యర్థులకు ఆదివారం ఆయన బీ ఫారాలను అందజేశారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణ గురించి అభ్యర్థులకు వివరించారు. ప్రచార అజెండా, పోల్ మేనేజ్‌మెంట్ కీలకమని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసాలు, అరాచకాలు, భూకబ్జాలు, అక్రమాలను ప్రజలకు వివరిస్తూ.. జగన్‌ను ఏకిపారేయాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో జగన్ ఇచ్చిన హామీలను విస్మరించిన వైనాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. బటన్ నొక్కుడుతో కొందరికే లబ్ధి చేకూరిందని, అత్యధిక మందికి వైసీపీ పాలనలో అన్యాయం జరిగిందనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు వైసీపీ ప్రభుత్వం చేసిన అన్యాయం, ఆ వర్గాల పథకాలను రద్దు చేసిన విషయాన్ని ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించాలని అన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు విస్మరించిన హామీలను కూడా ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. సీఎం జగన్ మోసాలు, అబద్ధాలు, సిటింగ్ ఎమ్మెల్యేల అకృత్యాలు, దౌర్జన్యాలు, అక్రమాలపై ముప్పేట దాడిచేస్తూ.. ప్రజలను చైతన్యవంతులను చేయాలని అన్నారు. ఈ 20 రోజులు నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు. జగన్ మోసాలు, ఐదేళ్ల పాలనలో అరాచకాలు, విధ్వంసాలపై ప్రజలు విసిగివేసారిపోయారని అన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పి.. ఎన్డీఏ కూటమికి అధికారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అభ్యర్థులు ప్రజలను మరింత చైతన్యవంతులను చేసి, గెలుపును నల్లేరుమీద నడకగా మార్చుకోవాలని సూచించారు. అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్ అసెంబ్లీ అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, కళ్యాణదుర్గం అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు, గుంతకల్లు అభ్యర్థి గుమ్మనూరు జయరాం, శింగనమల అభ్యర్థి బండారు శ్రావణిశ్రీకి చంద్రబాబు బీఫారాలను అందజేశారు. మిగిలిన నియోజకవర్గాల అభ్యర్థులు బి-ఫామ్‌లు అందుకోవాల్సి ఉంది..

నేడు పదో తరగతి ఫలితాలు


అనంతపురం విద్య, ఏప్రిల్ 21: పదో తరగతి పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేయనున్నారు. మార్చి 18 నుంచి 30వ తేదీ వరకూ పది పరీక్షలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 142 పరీక్షా కేంద్రాల్లో 40,063 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకూ మూల్యాంకనం నిర్వహించారు. ఫలితాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ సోమవారం విడుదల చేయనున్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో ఉదయం 11 గంటలకు పరీక్షల ఫలితాలు విడుదల చేస్తారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.



పనులు పూర్తి కాని కుందుర్పి బ్రాంచ్ కెనాల్



ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం చేయాల్సిన ప్రదేశం



రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు సాగునీటిపై జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏవీ అమలు కాలేదు. ఆయన ప్రతిపక్ష నేతగానే కాకుండా ముఖ్యమంత్రి హోదాలో వచ్చినప్పుడు కూడా అవే హామీలు ఇచ్చారు. నిధులుమంజూరు చేస్తానని, మూడు నెలల్లో పనులు ప్రారంభిస్తామని నమ్మించారు. దీంతో సాగునీటితో తమ బతుకులు మారతాయని రైతులు ఆశించారు. కానీ ఐదేళ్ల పాలన గడిచిపోయింది. హామీలు అలాగే ఉండిపోయాయి.

హెచ్చెల్సీ ఆధునికీకరణ అటకెక్కించలేదా..?

నేమకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎక్కడ..?

114 చెరువులకు నీరు ఎప్పుడిస్తారు..?

సీఎం జగనన్ను నిలదీస్తున్న రైతాంగం

ఇది మాట తప్పడం కాదా..?

బీటీపీకి కృష్ణా జలాల మళ్లింపు ఏదీ..?

రాయదుర్గం/కళ్యాణదుర్గం, ఏప్రిల్ 21:
ప్రతిపక్ష నేతగా చేపట్టిన పాదయాత్రలో జగన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదు. రాయదుర్గం నియోజకవర్గంలో మూడు హామీలను ఇచ్చి ఇప్పటికీ తీర్చకపోవడంపై జనం పెదవి విరుస్తున్నారు. వాటిలో ముఖ్యంగా భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలను మళ్లిస్తామని, తుంగభద్ర ఎగువకాలువను ఆధునికీకరిస్తామని, బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద నేమకల్లు ఆంజనేయస్వామి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ఐదు టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తామని హామీలు గుప్పించారు. రాయదుర్గం, గుమ్మఘట్టలో ఐదేళ్ల కాలంలో రెండుసార్లు సీఎం పర్యటన జరిగింది. అప్పుడు కూడా వేదికలపై వీటి గురించి గట్టిగా నమ్మబలికారు. కానీ ఆచరణలో మాత్రం ఒక్క అంగుళం కూడా ముందుకు సాగలేదు. దీంతో సీఎం జగన్ హామీలు నీటిమీద రాతల్లా మిగిలిపోయాయి.

అంతా రివర్స్

భైరవానితిప్ప రిజర్వాయర్‌కు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తరలించేందుకు రూ.150 కోట్ల వ్యయంతో పనులు చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఇక్కడి రైతుల సాగునీటి కష్టాలు తీరుస్తానని అన్నారు. అంతకు మునుపే తెలుగుదేశం ప్రభుత్వం రూ.989 కోట్లు నిధులు మంజూరు చేసి కృష్ణాజలాల మళ్లింపు పనులను ప్రారంభించింది. కానీ నిధులను మింగేందుకు ఎక్కువ అంచనాలు వేసుకున్నారని ఆరోపిస్తూ.. జగన్ రివర్స్ టెండరింగ్‌కు ప్రయత్నించారు. కానీ అందులో డొల్లలేదని నిగ్గు తేలింది. పైగా ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తనను గెలిపిస్తే రూ.150 కోట్లతో జీడిపల్లి నుంచి బీటీపీకి నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. తర్వాత ముఖ్యమంత్రి జగన్ పర్యటన సందర్భంగా రూ.989 కోట్లతో మూడునెలల్లో పనులు పూర్తి చేస్తామని హామీని ఇప్పించి మూడేళ్లు గడిచింది. ఇప్పటి వరకు ఒక్క అంగుళం కూడా జగన్ ప్రభుత్వ హయాంలో పనులు ముందుకు సాగలేదు.




బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద నేమకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చి, జగన్ చేతు లెత్తేశారు.

ఇదీ అంతే..

హెచ్చెల్సీ ద్వారా అందుతున్న జలాలు సద్వినియోగం చేసుకోవడంతోపాటు కష్టకాలంలో ఉంతకల్లు రిజర్వాయర్ ద్వారా నీటి వినియోగం చేసుకోవచ్చనే ఆలోచనతో రైతుల శ్రేయస్సు కోరి టీడీపీ ప్రభుత్వం రూ.5 కోట్లతో డీపీఆర్ కూడా సిద్ధం చేసింది. దీని ప్రకారం రిజర్వాయర్ నిర్మిస్తామని సీఎం జగన్ రెండుసార్లు స్పష్టమైన హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు చిల్లిగవ్వ కూడా విదల్చలేదు. ఐదేళ్ల కాలంలో పనులు ప్రారంభమవుతాయని ఆశపడిన రైతులకు భంగపాటు ఎదురైంది. 70 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతాయని ఆశించారు. కానీ డీపీఆర్ మాత్రం బుట్టదాఖలు చేశారు.

అటకెక్కిన ఆధునికీకరణ



భైరవానితిప్ప ప్రాజెక్టు

తుంగభద్ర ఎగువకాలువను 84 కి.మీ. మేర ఆధునికీకరిస్తామని జగన్ స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆధునికీకరణ పనులను పదేళ్ల క్రితమే ఆరు ప్యాకేజీలుగా రూ.450 కోట్లతో ప్రారంభించారు. తెలుగుదేశం హయాంలో 60 శాతం పనులను పూర్తి చేశారు. మిగిలిన పనులను వైసీపీ అధికారంలోకి రాగానే వేగంగా పూర్తి చేస్తామని నమ్మబలికారు. కాలువ శిథిలావస్థకు చేరుకుంది. ఏటా నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. అయినా.. ఆధునికీకరణ దిశగా జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఎగువ కాలువపై ఉన్న బ్రిడ్జిలు ఎక్కడికక్కడ కూలిపోతున్నాయి. అయినా వైసీపీ ప్రభుత్వం మొద్దు నిద్రను వీడలేదు. ఇప్పటి వరకు వ్యయ ప్రయాసలతో కాలువలో నీటిసరఫరా సాగుతోంది. ఎప్పుడు ఎక్కడ గండి పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కనీసం షెట్లర్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయలేదు. వైసీపీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కణేకల్లు, బొమ్మనహాళ్ రైతాంగం మండిపడుతోంది.

114 చెరువులకు నీరు ఉత్తిదే..

కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం జీడిపల్లి జలాశయం నుంచి కుందుర్పి బ్రాంచ్ కెనాల్, భైరవానితిప్ప ప్రాజెక్టుకు నీరు తరలించేందుకు రూ.968 కోట్లు నిధులు మంజూరు చేసింది. దాదాపు 20 శాతం పనులు పూర్తి చేసింది. అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌రెడ్డి కుందుర్పి బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేసి, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులకు నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాటను విస్మరించింది. 114 చెరువులకు నీరిచ్చిన తరువాతనే 2024లో ఓట్లు అడగడానికి వస్తామని జగన్‌రెడ్డి, అప్పటి వైసీపీ అభ్యర్థి ఉష శ్రీచరణ్ ప్రగల్భాలు పలికారు. గెలిచి.. మంత్రి అయిన ఉష శ్రీచరణ్ హామీని విస్మరించారు. ఐదేళ్లు గడిచాక నియోజకవర్గం వీడి.. పెనుకొండకు వలస వెళ్లారు. సీఎం జగన్ దీనికి ఏమని సమాధానం చెబుతారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్షంలోనే కాకుండా 2021లో రాయదుర్గం పర్యటనకు వచ్చినప్పుడు కూడా భైరవానితిప్ప ప్రాజెక్టు గురించి సీఎం జగన్ ఇవే హామీలు ఇచ్చి మోసగించారు.

రైతు దగా ప్రభుత్వం..



సాగునీరు అందిస్తామని వైసీపీ ప్రభుత్వం మాటలు చెప్పి దగా చేసింది. భూగర్భ జలాలు అడుగంటి పోయి, వేసిన పంటలు చేతికి రాకుండా ఎండిపోతున్నాయి. 114 చెరువులకు నీరు ఇచ్చిన తరువాతే ఓటు అడగడానికి వస్తామని వైసీపీ నాయకులు అప్పట్లో హామీ ఇచ్చారు. మాట తప్పిన మంత్రి ఉషశ్రీ చరణ్.. బదిలీపై పెనుకొండకు వెళ్లిపోయారు. **- దొణతిమ్మప్ప, రైతు, ఎర్రంపల్లి**

బకాయిలపై ఉద్యోగుల్లో ఆందోళన

రూ.25 వేల కోట్లు ఎక్కడి నుంచి తెచ్చిస్తారు..?

ప్రభుత్వ అలసత్వంపై ఉద్యోగ సంఘాలు స్పందించాలి

ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ



సదస్సులో మాట్లాడుతున్న ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

అనంతపురం విద్య, ఏప్రిల్ 21: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్రంలో రూ.25 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, పేరుకుపోతున్న బకాయిలపై ఉద్యోగ సంఘాలు స్పందించాలని ఏపీజీఈఏ, ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. వేల కోట్ల బకాయిలపై ఉద్యోగుల్లో ఆందోళన ఉందని అన్నారు. వాటిని ఎలా చెల్లిస్తారో ఉద్యోగులకు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నగర శివారులోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్యవేదిక చైతన్య సదస్సును నిర్వహించారు. సదస్సు ఆరంభానికి ముందు ఎంపీడీఓ గీతావాణి, ఇతర అధికారులు అభ్యంతరం తెలిపారు. 'ఎన్నికల కోడ్ ఉంది కదా..? అనుమతి తీసుకున్నారా..? సదస్సు ఎలా నిర్వహిస్తారు..?' అని ప్రశ్నించారు. సదస్సు గురించి ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చామని సూర్యనారాయణ వారికి తెలిపారు. తాము ఎన్నికల కోడ్ పరిధిలోకి వచ్చేలా సదస్సు పెట్టుకోలేదని అన్నారు. కోడ్ కారణంగా సదస్సుకు హాజరయ్యే వారి సంఖ్యకు పరిమితి ఉన్నట్లు నిబంధనలు ఉంటే చూపాలని, ఆ తర్వాత తనకు నోటీసు ఇవ్వవచ్చునని ఆయన అన్నారు. దీంతో 'మా బాధ్యత కాబట్టి చెబుతున్నాం' అంటూ ఎంపీడీఓ వెనుదిరిగారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కాకపోగా, జటిలంగా మారాయని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వారి అస్తిత్వానికే ప్రమాదమని అన్నారు. అన్ని ఉద్యోగ సంఘాల్లో మార్పు రావాలని, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సంఘాల మధ్య ఉన్నది భేదాభిప్రాయమే గాని, వ్యక్తిగత కక్షలు కాదని అన్నారు. అందరి లక్ష్యం ఉద్యోగుల సంక్షేమమేనని అన్నారు. ఆ దిశగా కార్మిక స్థాయి నుంచి ఉద్యోగుల వరకూ చైతన్యం తెచ్చేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం సదస్సు వేదికపై ఆయన ప్రసంగించారు. రూ.25 వేల కోట్ల చెల్లింపు ఆగిపోయినా ఉద్యోగ సంఘాలు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. వీటిని ఎలా చెల్లిస్తారో ప్రభుత్వం ఉద్యోగులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగులకు కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందని, వాటికి సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చినా ఇంకా చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఏర్పడిన సమస్యలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నాయని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాల్సి ఉందని అన్నారు. సచివాలయ ఉద్యోగుల సర్వీస్ రెగ్యులరైజేషన్ ఆలస్యం కావడంతో ప్రతి ఉద్యోగికి 9 నెలల నుంచి 10 నెలల జీతం పెండింగ్‌లో ఉందని వివరించారు. 30 ఏళ్లుగా ఎలాంటి సర్వీసు రూల్స్ లేని కారణంగా ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతులు కోల్పోతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వాల అలసత్వం కారణంగా అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యవేదిక కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కో చైర్మన్ హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి బాజీ పఠాన్, ఉపాధ్యక్షులు రవీంద్రబాబు, రమేష్‌కుమార్, పాపారావు, కేదారేశ్వరరావు, అబ్దుల్ రజాక్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మాంగటి శ్రీనివాసరావు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శులు మహేశ్వర్‌రెడ్డి, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సు నిర్వహణకు అభ్యంతరం తెలుపుతున్న రాప్తాడు ఎంపీడీఓ గీతావాణి

ఉచ్చు బిగుస్తోంది గురూ..!



రాజకీయ విందుపై దర్యాప్తు ముమ్మరం

ఎస్పీని టవర్ డంప్ కోరిన జడ్పీ సీఈఓ..?

అనంతపురం విద్య, ఏప్రిల్ 21: రాజకీయ విందులో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఎస్ఎస్ఏ ఉద్యోగుల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. కీలక సాక్ష్యాలు లేకుండా చేసినా.. 'టవర్ డంప్' ద్వారా డిన్నర్ జరిగిన దాబా ప్రాంతంలో ఎవరెవరు ఉన్నారో కనిపెట్టేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది. ఎస్పీ ద్వారా విందు జరిగిన ప్రాంతంలో సెల్‌ఫోన్ సిగ్నల్స్, కాల్‌డేటాను సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం.

తొక్కిపెట్టాలని..

ఎన్నికలలో వైసీపీకి మద్దతు కోరేందుకు గత నెల 31న గురువులు రాజకీయ విందు చేసుకున్నారు. నేషనల్ హైవే సమీపంలోని ఓ డాబాలో ఏర్పాటు చేసిన డిన్నర్‌కు సుమారు 150 మంది హాజరయ్యారు. ఈ విందులో వైసీపీ ఎమ్మెల్యే ఒకరు పాల్గొన్నారు. ఆయనకు మద్దతుగా వైసీపీ అనుబంధ ఉపాధ్యాయ సంఘం నాయకులు, వైసీపీ అనుకూల ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు వ్యవహారం నడిపించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు రావడంతో కలకలం రేగింది. విందులో పాల్గొన్న గురువిందలు అప్రమత్తమై.. సాక్ష్యాలు లేకుండా సీసీ ఫుటేజీని తొలగించారని ప్రచారం జరిగింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఒక పార్టీకి మద్దతుగా నిర్వహించిన విందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరు కావడం విమర్శలకు తావిచ్చింది. కానీ విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు విచారణ మమ అనిపించారు.

అదే కీలకం..

విందు రాజకీయంపై జడ్పీ సీఈఓ విచారణకు దిగారు. విందు జరిగిన రోజు ఆ ప్రాంతంలో ఎవరెవరు ఉన్నారో సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గుర్తించాలని నిర్ణయించారు. అందుకు వసరమైన 'టవర్ డంప్' రిపోర్ట్ ఇవ్వాలని ఎస్పీకి జడ్పీ సీఈఓ లేఖ రాసినట్లు తెలిసింది. రాజకీయ విందులో కీలకంగా వ్యవహించిన ఐదుగురు ఉపాధ్యాయ సంఘాల నాయకులతోపాటు మరో 40 మంది వివరాలను ఇప్పటికే విచారణ అధికారులు సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వీరిని మరింతగా బిగించేందుకు 'టవర్ డంప్' కీలకం కానుంది. సీసీ ఫుటేజీ మాయమైనా.. టవర్ డంప్ ఆధారంగా అక్కడున్నవారి సెల్‌ఫోన్ సిగ్నల్స్, కాల్స్ వివరాలు బయట పడతాయి. దీని ఆధారంగా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఇంకెప్పుడు ఆసరా..?

- బటన్ నొక్కి మూడు నెలలు
- సీఎం జగన్‌పై పొదుపు మహిళల ఆగ్రహం



గడేకల్లులోని క్రాంతి గ్రామ సంఘం

ఇస్తారనే నమ్మకం లేదు..



ఓసీ, బీసీ మహిళలకు ఆసరా సొమ్ము రాలేదు. డబ్బులు వస్తాయని ఎదురు చూశాం. ఇంక వాస్తయన్న నమ్మకం లేదు. వైసీపీ కార్యక్రమాలకు రావాల్సిందే అని ఆ పార్టీ నాయకులు ప్రతి కార్యక్రమానికీ తీసుకెళ్లారు. కానీ డబ్బులు ఇవ్వకుండా మోసగించారు. **- జె.తులసి లక్ష్మి, గడేకల్లు క్రాంతి మహిళా సంఘం**

విడపనకల్లు, ఏప్రిల్ 21: సీఎం జగన్ బటన్ నొక్కి మూడు నెలలు అవుతున్నా పొదుపు మహిళల ఖాతాల్లోకి వైఎస్సార్ ఆసరా సొమ్ము జమకాలేదు. జిల్లా వ్యాప్తంగా 5,190 మహిళా సంఘాలకు ఇప్పటి వరకూ ఒక్క పైసా అందలేదు. ఇవన్నీ ఓసీ, బీసీ సామాజికవర్గ మహిళల గ్రూపులేనని సమాచారం. జిల్లా వ్యాప్తంగా వీరికి రూ.41.36 కోట్లు రావాల్సి ఉంది. డబ్బులు ఎప్పుడు పడతాయో తెలియని దిక్కు తెలియని స్థితిలో మహిళలు ఉన్నారు. విడపనకల్లు మండలంలో 56 మహిళా సంఘాలకు, వజ్రకరూరు మండలంలో 49 సంఘాలకు, ఉరవకొండ మండలంలో 99 సంఘాలకు, బెళుగుప్ప మండలంలో 100 సంఘాలకు ఆసరా సొమ్ము రావాల్సి ఉంది. ఓసీ, బీసీ మహిళలకు మాత్రమే ఆసరా సొమ్ము ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సభకు రావాలని బెదిరించారు



'జనవరి నెలలో సీఎం జగన్ ఉరవకొండకు వస్తున్నారు.. మీకు ఆసరా డబ్బులు వేస్తాడు. మహిళా సంఘం సభ్యురాలందరూ ఆ సభకు రావాలి' అని ఇంటింటికి తిరిగి చెప్పారు. సీఎం సభకు రాకపోతే ఆసరా డబ్బులు రావు అని బెదిరించారు. సభ అయిపోయి మూడు నెలలు గడిచినా మా గ్రామైక్య సంఘానికి ఒక్క రూపాయి కూడా రాలేదు. మా సంఘానికి రూ.రెండు లక్షలు రావాల్సి ఉంది. ఇంక వచ్చే పరిస్థితి కనబడటం లేదు. **- పి.రమాదేవి, గడేకల్లు క్రాంతి సంఘం**



ఉత్తుత్తి బటన్..



సీఎం జగన్ బటన్ నొక్కి మూడు నెలలైనా ఓసీ, బీసీ మహిళలకు ఆసరా సొమ్ము ఇవ్వలేదు. మా సంఘానికి నాలుగో విడత రూ.2 లక్షలు రావాల్సి ఉంది. గడేకల్లు గ్రామంలోనే 13 సంఘాలకు చెందిన 130 మందికి ఆసరా డబ్బులు రావాల్సి ఉంది. సీఎం జగన్ నిలువునా మోసం చేశాడు.
- కె.కళ్యాణమ్మ, గడేకల్లు మహిళా సంఘం సభ్యురాలు

జన కేతనం

ఆంధ్రజ్యోతి



ఫొటో ఆఫ్ ద డే

టీడీపీ కరపత్రాన్ని తదేకంగా చూస్తున్న చిన్నారి

ఏదో చెబుతున్నారే..

ఏదో చెబుతున్నారు. ఇదంతా మా కోసమేనా? అనుకుందేమో ఆ చిన్నారి. తదేకంగా విన్నట్లుంది. నాన్నమ్మ ఒడిలో కూచొని ఉండగా టీడీపీ నాయకులు మేనిఫెస్టో కరపత్రం తెచ్చి ఇచ్చారు. అందులోని అంశాలు ఆ నాయకులు వివరిస్తుండగా నానమ్మతో పాటు శ్రద్ధగా వింటున్నట్లు ఉన్న ఈ చిత్రం ఆదివారం యాడికి కుంటవీధిలో తీసింది. ఈ ఫొటో సోషల్ మీడియాలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ క్యాప్షన్‌తో వైరల్‌గా మారింది.

- యాడికి

పోలింగ్ కేంద్రాలు మూడు రకాలు

మీకు తెలుసా..?

ఎన్నికల అధికారులు మూడు రకాలుగా పోలింగ్ కేంద్రాలను విభజించారు. ఇందులో సాధారణ పోలింగ్ కేంద్రం. రెండోది సమస్యాత్మమైన పోలింగ్ కేంద్రం. మూడో రకం అతి సున్నితమైన పోలింగ్ కేంద్రం. రాజకీయ పార్టీలు, తమ అనుచరులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషించుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్, గొడవలు ఇతరేతర సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈ విధమైన విభజన జరిగింది. సాధారణ పోలింగ్ కేంద్రం కంటే అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రం వద్ద భద్రత ఎక్కువగా ఉంటుంది. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటారు. ఇలాంటి వాటిని ఇప్పటికే గుర్తించి జియోట్యాగింగ్ చేసి ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసి ఉంటారు. వీటి ఆధారంగా ఎన్నికల అధికారులు పర్యవేక్షిస్తుంటారు.

- హిందూపురం

సమాజంపై అవగాహన ఉండాలి

ఓటే వజ్రాయుధం



నేర చరిత్ర ఉన్న వారిని చట్టసభల్లోకి అనుమతించకూడదు. సమాజంపై పూర్తి అవగాహన ఉన్న వారినే చట్టసభలకు ఎన్నుకోవాలి. కొత్త ఆలోచనలతో ఉన్న యువతరం రాజకీయాల్లోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతోంది. ఫ్యాక్టరీలు, ఐటీ రంగం, పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి పెట్టేవారినే ఎన్నుకోవాలి.

- బాసినేని అశోక్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ముదిగుబ్బ

అందుబాటులో ఉండాలి..



నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడే కావాలి. సమర్థుడైన అభ్యర్థిని ఎన్నుకుంటేనే సమాజానికి మేలు జరుగుతుంది. యువతకు ఉపాధి, పరిశ్రమల ఏర్పాటు, వ్యవసాయ రంగం అభివృద్ధి, పేద వర్గాల అభ్యున్నతికి కృషి చేసే నాయకులను ఎన్నుకోవాలి.

- మహ్మద్ రియాజ్, వాచ్ మెకానిక్, ముదిగుబ్బ

కాంగ్రెస్ అనంత పార్లమెంట్ అభ్యర్థిగా మల్లికార్జున



మల్లికార్జునకు బీఫారాన్ని అందజేస్తున్న షర్మిల

అనంతపురం న్యూటౌన్: అనంతపురం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా మల్లికార్జునను ఎంపిక చేశారు. ఆదివారం ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్ ఎంపీ అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి మల్లికార్జునకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బీ ఫారాన్ని అందజేశారు.



తహసీల్దార్ కార్యాలయం

- 2019 ఎన్నికల నిర్వహణ బిల్లులు మంజూరు
- సింహభాగం కాజేసేందుకు ఉన్నతాధికారి యత్నం
- కింది స్థాయి సిబ్బంది సహకారం..
- వాటాల్లో తేడాలు
- అవినీతి వ్యవహారం బహిర్గతం

మింగుడుపడని సొమ్ము..!

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 21: వాటాల్లో వచ్చిన తేడాలతో ఓ రెవెన్యూ అధికారి అవినీతి బహిర్గతమైంది. వివరాల్లోకి వెళితే 2019ఎన్నికల నిర్వహణకు సంబంధించి దాదాపు రూ.68లక్షలు ఖర్చుకాగా రూ.12లక్షల బిల్లు పెండింగ్ ఉంది. ఇటీవలే మొత్తం మంజూరైంది. ఈ మొత్తాన్ని ఖర్చుచేసిన బిల్లుల ప్రకారం చెల్లించాల్సి ఉంది. కానీ ప్రస్తుతం అందరూ ఎన్నికల హడావుడిలో ఉండడంతో ఆ నిధులను కాజేయాలని ఆ ఉన్నతాధికారి అనుకున్నాడు. ఇందుకు కొందరు కింది స్థాయి సిబ్బంది సహకారం తీసుకున్నట్లు సమాచారం. అయితే పంపకాల్లో తేడాలతో విషయం బయటకు పొక్కింది. దీంతో తన మాట వినని కొందరు కిందిస్థాయి సిబ్బందిపై డెప్యుటేషన్ అస్త్రం ఉపయోగించాడు. కీలకంగా ఉన్న ఒకరిని యాడికి మండలానికి డెప్యుటేషన్‌పై పంపించాడన్న ఆరోపణలు ఉన్నాయి. తనకు వీరవిధేయంగా ఉండే సిబ్బందిని యాడికి మండలం నుంచి తాడిపత్రికి డెప్యుటేషన్ వేయించుకున్నాడన్న ప్రచారం జరిగింది. దీంతో పరిస్థితులు అన్ని చక్కబడ్డాయి అనుకొనేలోపే పంపకాల్లో మరి కొంతమంది సిబ్బందితో మనస్పర్థలు రావడంతో కథ అడ్డం తిరిగింది.



కిందిస్థాయి అధికారి వద్ద నిధుల మొత్తం?

వాటాల పంపకాల విషయం ఇప్పట్లో తేలదన్న నిర్ణయానికి వచ్చిన ఆ ఉన్నతాధికారి తనకు నమ్మకమైన కిందిస్థాయి అధికారుల్లో ఒకరివద్ద పెండింగ్ నిధుల మొత్తాన్ని దాచి ఉంచినట్లు సమాచారం. సాధారణంగా కార్యాలయానికి సంబంధించిన నగదు బ్యాంక్ ఖాతాల్లో ఉంటుంది. బిల్లుల చెల్లింపు సమయంలో అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సంతకాలు తీసుకొని బ్యాంక్ నుంచి డ్రా చేస్తారు. కానీ నిబంధనలను తుంగలో తొక్కి రూ.12లక్షల నిధులను వ్యక్తిగతంగా ఒకరివద్ద ఉంచినట్లు దారుణమనే విమర్శలు వినవస్తున్నాయి.

వణికిపోతున్న కొందరు కిందిస్థాయి సిబ్బంది

ఎన్నికల సమయం కావడంతో డెప్యుటేషన్‌పై వచ్చిన ఆ ఉన్నతాధికారి అక్రమార్జనకు తెరలేపారు. ఆ అధికారి చెప్పినట్లు చేస్తూ, సంతకాలు పెట్టుకుంటూ పోతే ఎన్నికల అనంతరం ఆ వ్యవహారం తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనన్న భయంతో కొందరు కిందిస్థాయి సిబ్బంది వణికిపోతున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం ఎవరి ప్రాంతాలకు వారు వెళ్లిపోతే తదనంతరం వచ్చే అధికారుల ద్వారా తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందేమోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.



ఆయన అవినీతి... ఈయనకు ఆదాయం

2019 ఎన్నికల నిర్వహణకు పెట్టిన మొత్తంలో దాదాపు రూ.6లక్షల మేర పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అప్పుడు పని చేసిన అధికారి బిల్లులు రెట్టింపు చేసి మంజూరు చేయించుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. నిర్వహణకు సంబంధించి సప్లయర్స్, వాహనాల డీజిల్‌బిల్లు, సిబ్బంది భోజనాలు, వసతి సౌకర్యాలు, స్టేషనరీ తదితర ఖర్చులన్నీ భరించాల్సి ఉంటుంది. కానీ గతంలో పనిచేసిన ఓ రెవెన్యూ అధికారి ఈ మొత్తాన్ని రెట్టింపు చేయడానికి దొంగబిల్లులు సృష్టించాడన్న ఆరోపణలు బలంగా వినిపించాయి. ఆ ఉన్నతాధికారి కిందిస్థాయి సిబ్బందిలో కొంతమంది సహకారం తీసుకొని దొంగ బిల్లులను సృష్టించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనను పంపించాడు. కానీ ప్రభుత్వ బిల్లుల మంజూరులో సాధారణంగా జరిగే ఆలస్యం కంటే మరింత ఆలస్యం అయ్యాయి. అంతలోపే ఆ అధికారి బదిలీ అయ్యాడు. కానీ ఇటీవలే ఆ బిల్లులు మంజూరుకావడం ప్రస్తుత ఉన్నతాధికారికి అనుకోని వరమైంది.

రెండు రోజుల కిందట కార్యాలయంలో సమావేశం?

నిధుల వాటాల్లో తేడాలు రావడంతో కిందిస్థాయి సిబ్బందిలో కొంతమందిని శాంతపరిచేందుకు ఆ ఉన్నతాధికారి రెండురోజుల కిందట రెవెన్యూ భవనంలో అర్ధరాత్రి వేళ రహస్య సమావేశం ఏర్పాటుచేశారని సమాచారం. ఈ సమావేశంలో కూడా మరోసారి పంపకాలపై మంతనాలు జరిపినట్లు తెలిసింది. కానీ నిధుల పంపకాల్లో స్పష్టత రాలేదని సమాచారం.

ప్రస్తుత ఎన్నికలకు రూ.38లక్షలు మంజూరు

ప్రస్తుతం జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తాడిపత్రి నియోజకవర్గానికి రూ.38లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తాన్ని ఎన్నికల్లో అవసరమయ్యే సప్లయర్స్, భోజనాలు, సిబ్బంది, వసతి సౌకర్యాలు తదితర వాటికి ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ ఈ నిధుల్లో కూడా కొంత స్వాహా చేయడానికి ఆ ఉన్నతాధికారి చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో తాడిపత్రి ప్రాంతం రాష్ట్రంలోనే అత్యంత సమస్యాత్మకమైంది. ఈనెల 18నుంచి ప్రారంభమైన అభ్యర్థుల నామినేషన్ల పర్వం 25వరకు కొనసాగుతుంది. తదనంతరం నామినేషన్ల విత్‌డ్రా, తిరస్కరణ తదితర వాటితో ఇతర అధికారులు బిజీగా ఉంటారన్న ఆలోచనతో ఈ నిధుల్లో అందిన కాడికి దోచుకోవాలని ఆ ఉన్నతాధికారి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

విచారణ చేసి బిల్లులు చెల్లిస్తాం

2019ఎన్నికలకు సంబంధించిన బిల్లులు మంజూరైన మాట వాస్తవమే. ఖర్చులకు సంబంధించి విచారించి బిల్లులు చెల్లిస్తాం. బిల్లుల్లో అవకతవకలు జరిగాయన్న మాటలు అవాస్తవం. ఎవరూ భయపడాల్సిన పనిలేదు. బిల్లులు చెల్లిస్తాం.

- అంజనేయులు తహసీల్దార్

నాటు రూటు..!



కాలేజీ బ్యాగులో నాటు సారా ప్యాకెట్ల రవాణా

యాడికి మండలంలో నాటు సారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో పాల్గొనేవారికి నాయకులు 'నాటు' మంత్రం వేస్తున్నారు. ప్రభుత్వ మద్యం కొనాలంటే ఖర్చు ఎక్కువ. అందుకే.. ఖర్చు తక్కువ.. కిక్కు ఎక్కువ అనుకుని.. పేదల ఆరోగ్యాన్ని పాడు చేసేందుకు పూనుకున్నారు. మరోవైపు జె-బ్రాండ్ మద్యం అంతా రాజకీయ నాయకులకే సరిపోతోందని మద్యం ప్రియులు నాటు బాట పట్టారు. వాటర్ ప్యాకెట్ సైజ్‌లో ఉండే నాటుసారా ప్యాకెట్‌ను రూ.50కు అమ్ముతున్నారు. యాడికి కుంటలో తెల్లవారుజామున 5 గంటల నుంచే నాటుసారా ప్యాకెట్ల విక్రయం కొనసాగుతోంది. పిన్నేపల్లిలో నాటుసారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ఊళ్లో కొందరు నాటుసారా విక్రయాలనే ఉపాధిగా ఎంచుకున్నారంటే.. పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నాటు సారా అమ్మితే రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ఆదాయం వస్తోందని సమాచారం. నంద్యాల జిల్లా బూరుగల, సీతమ్మ తండా నుంచి నాటు సారా ఈ ప్రాంతానికి వస్తోంది. అధికారులు దీనికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. సరిహద్దు చెక్‌పోస్టులు ఉన్నా.. నాటుసారా రవాణా ఎలా జరుగుతోం దబ్బా.. అని జనం చర్చించుకుంటున్నారు. ఫొటోలో చూస్తున్నారు కదా..? కాలేజీ విద్యార్థులు ఉపయోగించే సంచి నిండా నాటుసారా ప్యాకెట్లే..! శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్లు..!

- యాడికి

పురం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా షాహిన్

హిందూపురం, ఏప్రిల్ 21: హిందూపురం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సమద్ షాహిన్‌ను అధిష్టానం ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి 9 మంది ఎంపీ అభ్యర్థుల జాబితా ఆదివారం విడుదల చేశారు. సమద్ షాహిన్ చాలా ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ బెంగళూరులో వ్యాపారం చేస్తున్నాడు. 2019 ఎన్నికల సమయంలోనే హిందూపురం అసెంబ్లీ స్థానానికి ఈయన పేరును వైసీపీ పరిశీలించింది. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో హిందూపురం, కదిరి, ధర్మవరం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ ఆయనకు టిక్కెట్ కేటాయించింది.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

హిందూపురం, ఏప్రిల్ 21: పురం టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ నామినేషన్ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న కొంత మంది టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ హారున్‌బాషా తెలిపారు. ఈ నెల 19న నందమూరి బాలకృష్ణ ఆయన సతీమణి వసుంధరాదేవి నామినేషన్ దాఖలు చేశారు. వారితో పాటు మరో 8 మందికి మాత్రమే ఆర్‌ఓ కార్యాలయంలోనికి వెళ్లడానికి అనుమతులు వచ్చాయి. అయితే కొంత మంది టీడీపీ నాయకులు కోర్టుపనిమీద లోపలికి వెళ్లి, మరికొంత మంది తహసీల్దార్ కార్యాల యంలోకి వెళ్లి ఆవరణలో ఉండగా మొత్తం 12 మందిపై కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఆర్‌ఓ కార్యాలయం ఆవరణలో ఉండటంతో మునిసిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భారత్ మాతాకి జై..!

మోదీ, బీజేపీ, కమలం బొమ్మలతో శాలువా


బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌కు అందజేసిన చేనేత డిజైనర్ నాగరాజు



సత్యకుమార్‌కు భారత్‌మాతాకి జై నినాదాలతో తయారుచేసిన పట్టు శాలువాను బహుకరిస్తున్న దృశ్యం

ధర్మవరం, ఏప్రిల్ 21: ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత డిజైనర్ నాగరాజు ఏమి చేసినా అందులో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఇప్పటికే తన కళానైపుణ్యంతో వివిధ రకాల డిజైనింగులతో మెప్పించారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీపై తనకున్న ఉన్న అభిమానాన్ని డిజైనింగ్ రూపంలో చాటుకున్నారు. మోదీ, అమిత్‌షా వద్ద జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన సత్యకుమార్‌యాదవ్‌ను ఎన్డీఏ అభ్యర్థిగా నిలపడాన్ని హర్షిస్తూ పట్టు వస్త్రంపై ప్రత్యేక డిజైనింగ్ తయారు చేశారు. బార్డర్ మొత్తం మోదీ, బీజేపీ, కమలం బొమ్మలతోపాటు మధ్యలో 'భారత్ మాతాకీ జై' అనే నినాదాలతో కూడిన శాలువా తయారు చేశారు. ధర్మవరం అసెంబ్లీ అభ్యర్థి సత్యకుమారయాదవ్‌ను కలిసి ఆ డిజైనింగ్ గురించి వివరించి అదే శాలువాతో ఆయనను సన్మానించారు. మొదటిసారిగా బీసీ అభ్యర్థికి అసెంబ్లీ బరిలో నిలిచే అవకాశం అతిపెద్ద పార్టీ తరపున రావడం తమకెంతో ఆనందంగా ఉందని నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.

సిరా గుర్తు వేసేందుకు చూపుడువేలు లేకపోతే..



కదిరిఅర్బన్: సాధారణంగా ఓటు వేసే వారికి పోలింగ్ కేంద్రంలో సిబ్బంది ఎడమ చేతి చూపుడు వేలికి సిరా గుర్తు వేస్తారు. రెండోసారి ఓటేయడానికి రాకుండా ఉండేందుకు ఇలా చేస్తారని అందరికి తెలిసిన విషయమే. మరి ఆ వేలు లేని వారి పరిస్థితి ఎంటనే విషయం చాలా మందికి తెలియదు. ఎడ చేయి చూపుడు వేలు లేని ఓటర్ల విషయంలో భారత ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. ఎడమచేయి చూపుడు వేలు లేకపోతే మధ్యవెలికి సిరా గుర్తు వేయవచ్చు. అది కూడా లేకపోతే మధ్య వేలికి, అదీ లేకపోతే ఉంగరం వేలికి, అదీ లేకపోతే చిటికెన వేలికి, చివరకు నాలుగు వేళ్ల లేకపోతే బొటనవేలికి సిరా గుర్తు పెడతారు. ఎడమచేయి లేని ఓటర్లకు కుడిచేతికి ఇదే క్రమంలో సిరా గుర్తు వేస్తారు. రెండు చేతులకు వేళ్ల లేకపోతే ఎలా అంటే? వేళ్ల మొదలు, లేద మధ్య భాగం, లేదా చేతిపై గుర్తు వేస్తారు. భుజాల వరకు చేతులు లేని ఓటర్లకు ఎడమ చెంపపై సిరాగుర్తు పెడతారు.

ఎవరిని బైండోవర్ చేస్తారంటే..



ఎలాంటి ఎన్నికలు వచ్చినా పోలీసులు కొందరిని బైండోవర్ చేస్తుంటారు. బైండోవర్ అంటే బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్. ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచుతారు. గొడవలు సృష్టించేవారు, రౌడీషీటర్లు, బెల్టు షాపు నిర్వహించేవారు, అసాంఘిక శక్తులపై నిఘా పెండుతాడు. ఎన్నికల సమయంలో ఫలాన వ్యక్తులు వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా, వారి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని భావించినా అలాంటివారిని పోలీసులు తహసీల్దారు ఎదుట బైండోవర్ చేస్తారు. ఆనంతరం చట్ట వ్యతిరేక పనులు చేయబోమని బాండ్ పేపర్ మీద లిఖిత పూర్వకంగా హామీ తీసుకుంటారు. అలా బైండోవర్ అయిన వ్యక్తులు ఆరోజు నుంచి ఏడాదిపాటు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడితే ఇచ్చిన బాండ్‌లో ఎంత మొత్తం నమోదు చేసి ఉంటాదో అంత మొత్తం జరిమానాగా చెల్లించాలి. అలా చెల్లించకపోతే నేరస్తుడిగా పరిగణిస్తాడు. ఆ వ్యక్తిపై ఐసీసీ సెక్షను 106, 107, 108,110 కింద కేసు నమోదు చేస్తారు. రెండు, అంతకన్నా ఎక్కువ సార్లు బైండోవర్ అయితే రౌడీషీట్ నమోదు చేసే అవకాశం ఉంది.

- శింగనమల

ఆ రోజుల్లో...



ఆర్భాటం అస్సలు ఉండేది కాదు



ఒకప్పుడు ఎన్నికల ప్రచారంలో ఆర్భాటాలు అస్సలు ఉండేవి కాదు. ఎమ్మెల్యే అభ్యర్థి నాగులు చక్రాల వాహనంలో హంగు, ఆర్భాటం లేకుండా సాధారణంగా గ్రామానికి వచ్చేవారు. గ్రామంలో కొందరు పార్టీ పెద్దలను కలిసి పోలింగ్, ప్రచారంపై మాట్లాడి వెళ్లేవారు. అప్పట్లో గ్రామంలో రెండు వర్గాలు మాత్రమే ఉండేవి. ఒక్కో వర్గానికి ఒక పార్టీ పెద్ద ఉండేవారు. పార్టీ పెద్ద చెప్పినట్లు ఆ వ ర్గం ఓటర్లంతా వినేవారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు డబ్బు, మద్యం పంచేవారు కాదు. ఎన్నికల రోజు గ్రామంలో ఒక చోట భోజనం లేదా అల్పాహారం ఏర్పాటు చేసేవారు. మా పొరుగు గ్రామం ఓటర్లు ఎద్దుల బండిపై కొంత మంది, కాలినడకన మరి కొంత మంది నడిచి వచ్చి ఓటు వేసి వెళ్లేవారు.

- రాప్తాడు

తాంబూలం ఇచ్చి ఓట్లు అడిగేవారు..



గతంలో రాజకీయ నాయకులు గ్రామాలకు ప్రచారానికి వచ్చి ఓటర్లకు ఆకు, వక్క తాంబూలం ఇచ్చి ఓట్లు అడిగేవారు. అందరికీ అందుబాటులో ఉంటూ, సేవ చేసేవారికే ప్రజలు కూడా ఓటువేసేవారు. అప్పట్లో బ్యాలెట్ పేపర్‌పై నచ్చిన గుర్తుకు ఓటు వేసేవాళ్లం. ఎన్‌టీ రామారావు టీడీపీ స్థాపించినప్పుడు నాయకులు గ్రామాల్లోకి ప్రచారం కోసం రాకపోయిన మేమే పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి ఓటు వేశాం. ప్రస్తుత నాయకులు డబ్బులిచ్చి ఓట్లు వేయించుకుంటున్నారు. వీళ్లు గెలిస్తే ప్రజలను ఏం పట్టించుకుంటారు. ఇలాంటి సంస్కృతి పోవాలి.

- మడకశిర రూరల్

ఊరంతా ఒకే మాట..



అప్పట్లో ఎన్నికల ప్రచారంలో ఇంత హడావుడిగా ఉండేది కాదు. అభ్యర్థులు గ్రామ పెద్దలు, ఓటర్లను ఊరి మధ్యలోని రామాలయం వద్దకు పిలిచేవారు. గ్రామ పెద్దల సమక్షంలో ఓట్లను అడిగేవారు, ఊరంతా ఒకేమాట మీద హామీ ఇచ్చేవారు. అప్పట్లో గ్రామపెద్దలు కూడా తమ స్వార్థం కోసం కాకుండా ఊరికి ఉపయోగపడే పనులనే అభ్యర్థుల దృష్టికి తెచ్చి పరిష్కారం చేయమని అడిగేవారు.

- ముదిగుబ్బ

ఓటేసి... నరకం చూస్తున్నాం

గోవిందురాయునిపేట ప్రజలు



కంకర పోసి వదిలేసిన గోవిందరాయుని పేటకు వెళ్లే రోడ్డు

ఆ నాయకుడిది మా పక్క ఊరే. ఆయన భార్యే వైసీపీ తరపున పోటీ చేస్తోంది. పక్క ఊరే కావడంతో మా ఊరి సమస్యలు కూడా తెలిసి ఉంటాయని, పరిష్కరిస్తారని ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాం. ఏళ్లు గడిచినా మా ఊరి సమస్యలు మాత్రం తీరలేదని గోవిందురాయునిపేట ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శింగనమల నుంచి రాచేపల్లికి వెళ్లే ప్రధాన రహదారి నుంచి గోవిందురాయునిపేటకు అర కిలోమీటర్ దూరం ఉంది. ఈ రోడ్డంతా అధ్వానంగా ఉండేది. 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి గోవిందురాయునిపేటకు వచ్చారు. 'నేను మీవాణ్ని. నా భార్య జొన్నలగడ్డ పద్మావతికి ఓటు వేసి గెలిపించండి. మీ గ్రామానికి తారు రోడ్డు వేయిస్తా' అని మాటిచ్చాడు. పద్మావతి గెలిచాక మూడేళ్ల కిందట తారు రోడ్డు నిర్మాణం కోసం పనులకు భూమి పూజ చేశారు. రోడ్డుకు కంకర తోలి వదిలేశారు. ఇప్పటి వరకు రోడ్డు పూర్తి కాలేదు. గ్రామంలోని వెళ్లాలంటే కంకరపై నడవాల్సిందే. దీంతో ఆ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రోజు నమ్మి ఓట్లు వేశాం..నేడు నడవలేక నరకం చూస్తున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- శింగనమల

ముక్క దొరకలే..!



అనంతలో బంద్ చేసిన చికెన్ సెంటర్లు

పాతూరులోని మటన్ మార్కెట్‌కు సీల్ వేసి బంద్ చేసిన దృశ్యం

అనంతలో మటన్, చికెన్ సెంటర్ల మూసివేత


మహవీర్ జయంతి సందర్భంగా ఆదేశాలు

ప్రస్తుత రోజుల్లో ఆదివారం వచ్చిందంటే చాలా ఇళ్లలో ముక్క కొరకాల్సిందేనన్నట్లుగా పరిస్థితి మారింది. ఈక్రమంలో ఉదయమే నగరంలోని చికెన్, మటన్ సెంటర్ల వద్దకు జనం వెళ్లారు. తీరా అక్కడికి వెళ్లి చూస్తే సెంటర్లు మూసేశారు. ఇదేమని ప్రశ్నిస్తే మహవీర్ జయంతి సందర్భంగా బంద్ చేయాలని అధికారులు నోటీసులు ఇచ్చారని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు అక్కడున్న వారు చెప్పుకొచ్చారు. అయ్యో..! ఈ విషయం మాకు తెలియదే అంటూ జనం నిరాశతో వెనుతిరిగారు. మరి ఇంకో వైపు చూస్తే.. అసలే ఎన్నికల కాలం. రాజకీయ నాయకులు కూడా ఉధృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలోనే తమ వెంట తిరిగే కార్యకర్తలు, అభిమానులకు ఆదివారం పూట మాంసాహారం పెడుతుంటారు. అయితే ఆదివారం చికెన్, మటన్ దొరక్కపోవడంతో మామూలు భోజనమే దిక్కయ్యింది. దీంతో కొంతమంది మాంసాహార ప్రియులు ఉసూరుమన్నారు. ఎన్నడూ లేని విధంగా మహవీర్ జయంతి రోజున చికెన్, మటన్ సెంటర్లను బంద్ చేయించడంపై కొందరు అసహనం వ్యక్తం చేశారు. అయితే మద్యం దుకాణాలు తెరిచి ఉంచడం మందుబాబులకు కొంతవరకు ఊరటనిచ్చింది.

-

జన కేతనం
ఆంధ్రజ్యోతి

అనంతపురం
శ్రీ సత్యసాయి
సోమవారం 22 ఏప్రిల్ 2024





వినండహో..!

స్పామ్ కాల్స్ ద్వారా ఎన్నికల ప్రచారం

అనంతపురం అర్బన్: సోషల్ మీడియా ద్వారా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అధికార, ప్రధాన ప్రతిపక్షాలతో పాటు ఇతర పార్టీలు ఇప్పటికే వాట్సాప్, యూట్యూబ్, ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ తదితర మాధ్యమాల ద్వారా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా స్పామ్ కాల్స్ ద్వారా ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాయి. తమ పార్టీకి ఓటు ఎందుకు వేయాలి? ఇతర పార్టీలకు ఎందుకు వేయకూడదో పాటల ద్వారా వివరిస్తున్నారు. గత కొన్ని రోజులుగా చాలామంది ఓటర్లకు ప్రతి రోజూ మూడు నుంచి నాలుగు సార్లు స్పామ్ కాల్స్ వస్తున్నా యి. కొందరు స్పామ్ కాల్స్ అని గుర్తించగానే కట్ చేస్తున్నారు. మరికొందరు ఏముందో విందామని కాల్ లిఫ్ట్ చేయగా తమ పార్టీకి ఓటు వేయాల్సిన ఆవశ్యకతను పాట రూపంలో వివరిస్తుండటంతో ఇదేం ట్రెండ్ రా బాబూ అంటూ ఒకింత ఆశ్చర్యపోతున్నారు.

గ్రూపుల గోల !

వాట్సాప్ ద్వారా వేళాపాళా లేని ప్రచారం

ఉరవకొండ: ఎన్నికల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం ఉధృతమైంది. ఆ పార్టీ, ఈ పార్టీ, అర్ధరాత్రి, అపరాత్రి అన్న తేడా లేకుండా ప్రచారం హోరెత్తుతోంది. అన్ని పార్టీలు వివిధ స్థాయిల్లో వ్యాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుని ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. జిల్లా, నియోజకవర్గం, మండలంతో సంబంధం లేకుండా రాష్ట్రంలో ఎక్కడ ఏ పార్టీ నాయకుడు మాట తూలినా గ్రూపులలో వైరల్ చేస్తూ ప్రత్యర్థి పార్టీలపై నెగిటివ్ ప్రచారం కూడా చేస్తున్నారు. అయితే వ్యాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి చేస్తున్న ప్రచారం సగటు ఓటరును ఇబ్బంది పెడుతోంది. పొటోలు, వీడియోలు సమావేశాల సమాచారాన్ని పదుల సంఖ్యలో ఒకేసారి గ్రూప్‌లో పోస్టు చేస్తుండటం విసుగు తెప్పిస్తోంది. గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో ప్రధానపార్టీల నాయకులు వారికి తెలిసిన నెంబర్లతో గ్రూపులు ఏర్పాటు చేశారు. తమ గ్రూప్‌లో ఎక్కువ మంది ఉన్నారని చెపుకోవడానికి తమకు తెలిసిన నెంబర్లన్నీ కలుపుతున్నారు. దీంతో అవసరమున్నా లేకపోయినా గ్రూపులలో వచ్చే ఎన్నికల సందేశాల గోల ఓటరు భరించక తప్పని పరిస్థితి. ఏదైనా పార్టీకి చెందిన వ్యాట్సాప్ గ్రూపులో ఓ వ్యక్తిని యాడ్ చేస్తే ఇష్టం ఉన్నా లేకున్నా అందులో ఉండాల్సి వస్తోంది. పొరపాటు ఎగ్జిట్ అయితే తమ పార్టీ మనిషి కాదని వ్యతిరేకత ఏర్పరచుకునే అవకాశముందని గమ్మున ఉంటున్నారు. పార్టీల ప్రచార చిత్రాలు, వీడియోల డౌన్‌లోడ్‌తో సెల్‌ఫోన్‌లో డేటా తొందరగా అయిపోతోందని కొందరు ఓటర్లు గగ్గోలు పెడుతున్నారు.



సత్యాగ్రహ ఉద్యమంలో శింగనమల కీలకపాత్ర

భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు

నీలం సంజీవరెడ్డి, తరిమెల నాగిరెడ్డిని అందించిన నేల

మిడ్ పెన్నార్ డ్యాం ఉన్నా... తప్పని నీటి కష్టాలు

నియోజకవర్గ చరిత్ర



శింగనమల నియోజకవర్గం అంటే రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నియోజకవర్గం విప్లవాలకు పురిటిగడ్డ. ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది నేతలు చరిత్ర పుస్తకాలలో నిలిచిపోయారు. దివంగత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, భారత విప్లవోద్యమ నాయకుడు తరిమెల నాగిరెడ్డి లాంటి వారు పుట్టిన ప్రాంతం శింగనమల. గాంధీ పిలుపునిచ్చిన సత్యాగ్రహ ఉద్యమంలో శింగనమల మండలం తరిమెల గ్రామం ముఖ్యపాత్ర నిర్వహించింది. విప్లవ యోధుడు తరిమెల నాగిరెడ్డి ఈ నియోజకవర్గం నుంచి పోటి చేసి శాసనసభ్యుడిగా గెలుపొందారు. ఈ నియోజకవర్గం నుంచి ఏ పార్టీ అభ్యర్థులు గెలుపొందుతారో... ఆ పార్టీనే అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ కూడా ఉంది.

పోరాటాల పురిటిగడ్డ

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 21 : దేశంలో కొనసాగుతున్న ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లో శింగనమల నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. విప్లవాల పురిటిగడ్డగా శింగనమల నియోజకవర్గం వినపడుతుంది. ఇలాంటి ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, టీడీపీ ఐదు సార్లు గెలుపొందాయి. సీపీఐ, జనతా, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి విజయం సాధించారు. ఈ నియోజకవర్గంలో భూస్వాములుకు వ్యతిరేకంగా శ్రామికులు, కూలీల కోసం తరిమెల నాగిరెడ్డి ఈ ప్రాంతం నుంచి అనేక పోరాటాలకు శ్రీకారం చుట్టారు. 1955లో తొలుత పుట్లూరు నియోజకవర్గం కేంద్రంగా ఏర్పాటయింది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 1967లో శింగనమల కేంద్రంగా నియోజకవర్గం ఏర్పాటయింది. ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 14సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. శింగనమల నియోజకవర్గం ఎక్కువ శాతం వ్యవసాయ పంటల మీద జీవనం సాగిస్తారు. రెండో స్థానంలో గృహనిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రాష్ట్రంలోనే చీని పంటలకు నిలయం. శింగనమల నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి అత్యధికంగా 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కొత్తపల్లి జయరాం 47,198 ఓట్లతో విజయం సాధించారు. 1962లో అత్యల్పంగా 962 ఓట్లతో స్వతంత్ర అభ్యర్థిగా తరిమెల నాగిరెడ్డి గెలుపొందారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 5 సార్లు, కాంగ్రెస్ 5 సార్లు, వైసీపీ ఒకసారి విజయం సాధించాయి.

తొలి ఎమ్మెల్యే స్వాతంత్ర్య సమర యోధుడు

శింగనమల నియోజకవర్గం కాక ముందు పుట్లూరు నియోజకవర్గం తొలి ఎమ్మెల్యేగా స్వాతంత్ర్య సమరయోధుడు తరిమెల రామచంద్రారెడ్డి ఎన్నికయ్యారు. స్వయాన తన బంధువు తరిమెల నాగిరెడ్డిపై విజయం సాధించారు. తమిళనాడు రాష్ట్రం తిరుచానారులో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వంపై తిరగబడి జైలుకు వెళ్లారు. విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు, సేవా కార్యక్రమాలు చేపట్టేవారు. 1955లో తొలిసారి కాంగ్రెస్ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. తరిమెల రామచంద్రారెడ్డి శింగనమల మండలం తరిమెల గ్రామంలో 1915లో జన్మించారు. 1967లో శింగనమల నియోజకవర్గం ఏర్పడిన తొలిసారి ఎమ్మెల్యేగా కె. చిన్నశ్రీరంగయ్య కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు.

నీటి వనరులు

నియోజకవర్గంలో ప్రధానంగా గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల గ్రామంలో మిడ్‌పెన్నార్ డ్యాం ఉంది. ఈ డ్యాం ద్వారా నియోజకవర్గంలోని హెచ్చెల్సీ కాలువ ద్వారా గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో దాదాపు 47 వేల ఎకరాలకు రబీసీజన్‌లో పంటలకు సాగు నీరు వస్తుంది. వీటితో పాటు బుక్కరాయసముద్రం, శింగనమల చెరువులు అతి పెద్దవిగా ఉన్నాయి. నియోజకవర్గం వ్యాప్తంగా మైనర్ ఇరిగేషన్ చెరువులు 45 ఉన్నాయి.

ప్రధాన సమస్యలు

శింగనమల నియోజకవర్గంలో ప్రధానంగా సాగునీటి సమస్యతో రైతులు అల్లాడిపోతున్నారు. ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి 45 చెరువులకు హంద్రీనీవా ద్వారా నీటి కేటాయింపులు చేస్తూ ప్రత్యేక జీవో విడుదల చేయించారు. వీటితో పాటు శింగనమల చెరువు లోకల్‌జైషన్ చేసినట్లు ఆర్భాటంగా ప్రచార చేసుకున్నారు. ఆచరణలో ఎక్కడ అమలు కాలేదు. రెండు సంవత్సరాల నుంచి రైతులు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఒక్క చెరువుకు నీరు విడుదల చేయించిన పాపాన పోలేదు. ఎంపీఆర్‌డ్యాం రెండు గేట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డ్యాం గేట్ల మరమ్మతులు చేయించ లేదు. దీంతో నీరంతా వృథాగా వెళ్లాయి. గ్రామాల్లో టీడీపీ హయాంలో వేసిన రోడ్లే దర్శనమిస్తాయి. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఇప్పటికి అ నేక గ్రామాలకు ప్రధాన రహదారులు లేక ప్రజలు నానా అవస్థ లు పడుతున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. వీటికి తోడు పలు గ్రామాలను తాగునీటి సమస్య గ్రామాల్లో వెంటాడుతోంది.





మండలాలు
బుక్కరాయసముద్రం, శింగనమల, నార్పల, గార్లదిన్నె, పుట్లూరు, యల్లనూరు
నియోజకవర్గం విస్తీర్ణం: 1799.01 చదరపు కిలో మీటర్లు
మండలాలు :6
రెవెన్యూ గ్రామాలు:99
గ్రామ పంచాయతీలు: 117
గ్రామాలు : 232
జనాభా: 2,92,414
పురుషులు:1,48,841
మహిళలు:1,43,573

ఓటర్ల వివరాలు
శింగనమల నియోజకవర్గం - ఎస్సీ
మొత్తం ఓటర్లు : 2,45,625
పురుషులు :1,22,341
మహిళలు : 1,23,257
థర్డ్‌జెండర్ :27
పోలింగ్ కేంద్రాలు :293

●ప్రధాన సంస్థలు

శింగనమల నియోజకవర్గంలో ప్రధానంగా సెంట్రల్ యూనివర్సిటీ, ఓపెన్‌ఎయిర్ జైలు, జిల్లా జైలు, ఏపీఎస్పీ పోలీసు 14వ బెటాలియన్, కృషివిజ్ఞాన కేంద్రం, రేకలకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం, వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ, గడ్డివిత్తనోత్పత్తి కార్యాలయం, పశుపరిశోధన కేంద్రం ఉన్నాయి.

●ప్రముఖ పుణ్యక్షేత్రాలు

నియోజకవర్గంలోని నార్పల మండలం గూగూడు గ్రామంలో మొహరం వేడుకలు రాష్ట్రంలోనే అంగరంగ వైభవంగా జరుగుతాయి. అతిపురాతనమైన బుక్కరాయసముద్రంలోని కొండమీదరాయుడు స్వామి, గార్లదిన్నె మండలం కోటంక గ్రామంలో గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రముఖ పుణ్యక్షేత్రాలుగా గుర్తింపు పొందాయి.


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి


కొండమీదరాయుడు స్వామి




ఏమి చేయాలబ్బా ఇప్పుడు ?

అయోమయంలో వలంటీర్లు ?

తనకల్లు, ఏప్రిల్ 21: వైసీపీ నాయకుల ఒత్తిళ్లు, హుకుంలతో మండలంలోని వలంటీర్లు అయోమయంలో పడ్డారు. మండలంలోని 17 పంచాయతీల్లో 272మంది వలంటీర్లున్నారు. ఇందులో ఇప్పటికే నలుగురు వలంటీర్లను ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు అధికారులు విధుల నుంచి తొలగించారు. మరో 16మంది నాయకుల ఆదేశాలతో రాజీనామాలు చేశారు. మిగిలిన 252మంది అయోమయంలో ఉన్నారు. రాజీనామా చేస్తే ఈనెల జీతం ఇస్తారోలేదో తెలియక తికమకపడుతున్నారు. అంతేకాకుండా వలంటీర్ల నియమాకానికి 18-35 సంవత్సరాలలోపు ఉండాలని నిబంధనలున్నాయి. దీంతో వయసు మీరుతున్న 70మంది వలంటీర్లు తాము రాజీనామా చేస్తే నిబంధనల ప్రకారం తాము మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం లేదని ఆందోళన చెందుతున్నారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే జీతం రూ.పదివేలు ఇస్తామని ప్రకటించడంతో రాజీనామా చేయకుండా ఉంటే తమకు గ్యారెంటీగా వలంటీర్ పోస్టు ఉంటుందని మరికొందరు ఆలోచిస్తున్నారు.


రాజీనామా చేయం: వలంటీర్లు

శింగనమల: ఈపొద్దే రాజీనామా చేయాలన్న వైసీపీ నాయకుల హుకుంను వలంటీర్లు బేఖాతరు చేయడంతో అధికార పార్టీ నాయకులకు షాక్ తగిలినట్లయింది. శుక్రవారం మండల వైసీపీ నాయకుడు మండలంలోని వలంటీర్లు అందరు శనివారంలోపు రాజీనామా చేయాలని ఆదేశించాడు. ఒక వలంటీరూ రాజీనామా చేయలేదు. శింగనమలకు చెందిన 8మంది వలంటీర్లు మాత్రం ఎంపీడీ ఓ కార్యాలయం వద్దకు వచ్చి రాజీనామా చేయకూడనే వెనుతిరిగారు. రాజీనామా చేస్తే భవిష్యత్తులో అవకాశం ఉండదని భావించి, వైసీపీ నాయకుడు చెబితే మనం ఎందుకు రాజీనామా చేయాలని వలంటీర్లు చర్చించుకున్నట్లు సమాచారం.



మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి ఈ నియోజకవర్గం వాసే..

మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామంలో 1913 మే19లో జన్మించాడు. 1929 లోనే మహాత్మా గాంధీ స్ఫూర్తితో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ అవతరణలో సంజీవరెడ్డి ప్రముఖ పాత్ర పోషించారు. 1946లో మద్రాసు శాసన సభకు ఎన్నికయ్యారు. 1949లో మద్రాసు ప్రభుత్వ మంత్రి వర్గంలో పని చేశారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. 1977లో లోక్‌సభ స్పీకర్, అనంతరం భారత రాష్ట్రపతి పదవులను నిర్వహించారు. శింగనమల నియోజకవర్గ రైతాంగం కోసం హెచ్చెల్సీ ఏర్పాటు చేయించడంలో ఆయనది కీలక పాత్ర. ఇప్పటికి ఈ ప్రాంత రైతులు నీలం సంజీవరెడ్డిని గుర్తు చేసుకుంటారు.



వ్యవసాయమే జీవనాధారం

శింగనమల నియోజకవర్గంలో ప్రధానంగా వ్యవసాయ పంటలమీదే జీవనం సాగిస్తుంటారు. వీటితో పాటు గృహ నిర్మాణ, రైతు కూలీలు ఎక్కువ మంది ఇతర గ్రామాలకు వెళ్లి ఉపాధి పొందుతుంటారు. వ్యవసాయం పంటల సాగుపై రైతాంగం ఎక్కువ ఆధారపడి ఉంది. సాగు నీరు అందించడంలో రాజకీయ పార్టీలు విఫలమవుతున్నాయి. హెచ్చెల్సీకి రావాల్సిన నీటి కోటాను సాధించడంలో నాయకులు విఫలమవుతున్నారు. చెరువులకు నీరు విడుదల చేసే విషయంలో కూడా అన్యాయం జరుగుతోంది. సాగునీటి విషయంలో ఎన్నికల ముందు హామీలు ఇచ్చే నేతలు తర్వాత పట్టించుకోలేదని స్థానిక ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి కల్పించడంలో నాయకులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి.



అభివృద్ధే యువగళం !

యాడికి, ఏప్రిల్ 21: ప్రజాస్వామ్యదేశంలో ఓటు వజ్రాయుధం. నోటుకు ఓటు అమ్ముడుపోతున్న నేటి ఆధునిక సమాజంలో ఓటు వినియోగం గురించి తమ గళాన్ని వినిపిస్తున్నారు యువ ఓటర్లు. తమకు ఇప్పుడు ఓటు హక్కు వచ్చిందని ఆనందాన్ని వ్యక్తం చేయడంతోపాటు ఓటు వినియోగంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

రూ.5వేలకు పరిమితం చేశారు



ఉన్నత చదువులను చదివిన ఎంతోమంది నిరుద్యోగులను రూ.5వేల వేతనానికి పరిమితం చేశారు. ఒక్క ఉద్యోగ నియామకం లేదు. అభివృద్ధిని విస్మరించిన పాలకులకు బుద్ధి చెప్పడానికి మాకున్న ఆయుధం ఓటు. నాకు ప్రస్తుతం ఓటు హక్కు వచ్చింది. రాష్ట్ర అభివృద్ధిని కాంక్షించే వారికే నా ఓటు వేస్తా.

- తేజస్వి, ఎంసీఏ, యాడికి

మెగా కాదు దగా డీఎస్సీ



ఎన్నికల తరుణంలో అతి తక్కువ పోస్టులతో డీఎస్సీ ఇచ్చారు. అది కూడా నిర్వహణ కష్టమే. ఇలాంటి పాలకులకు మేము ఎందుకు ఓటువేయాలి. ఈ ఏడాదే నాకు ఓటు హక్కు వచ్చింది. ప్రస్తుత పాలకులు ఈ ఐదేళ్లకాలంలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. అప్పట్లో మెగా డీఎస్సీ ఇస్తాం అన్నారు.

- శారద, డీఎడ్, యాడికి

రాజధాని లేకుండా చేశారు



పరీక్షల్లో రాష్ట్ర రాజధాని ఏది అంటే సమాధానం ఏమి రాయాలో తెలియని పరిస్థితిలో విద్యార్థులు ఉన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన వారికి ఓటు ఎందుకు వేయాలి. నాకు ఈ ఏడాదే ఓటు హక్కు వచ్చింది. నా హక్కును రాష్ట్ర భవిష్యత్తు కోసం పాటుపడేవారి కోసం ఉపయోగిస్తా.

- షమీమ్, డిగ్రీ యాడికి

ఒక్క సాఫ్ట్‌వేర్ కంపెనీ తీసుకురాలేదు



నేను బీటెక్ ఫైనలియర్ చదువుతున్నా. నాకు ప్రస్తుతం ఓటు హక్కు వచ్చింది. రాష్ట్రానికి ఒక్క సాఫ్ట్‌వేర్ కంపెనీ కూడా తీసుకురాని ప్రస్తుత పాలకులకు ఎందుకు ఓటు వేయాలి. రాష్ట్ర అభివృద్ధిని విస్మరించారు. రాష్ట్రం కోసం శ్రమించే వారికి, యువతకు ఉపాధి కల్పించే వారికే నా ఓటు.

- దినేష్, బీటెక్, నూతన ఓటరు యాడికి

అవినీతి పాలకులకు బుద్ధి చెబుతాం



నాకు ఈ ఏడాది ఓటు హక్కువచ్చింది. బీటెక్ చేసినా ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వలస వెళ్లవలసి వస్తోంది. ప్రస్తుత పాలకులు అవినీతి, అరాచకాలకు పాల్పడుతుండటంతో రాష్ట్రానికి ఒక్క సాఫ్ట్‌వేర్ కంపెనీ కూడా రాలేదు. ఇంక అభివృద్ధి ఏమి జరుగుతుంది. యువతకు ఉద్యోగాలు ఏమి వస్తాయి. అందుకే రాష్ట్ర అభివృద్ధిని కోరే పార్టీకే నా ఓటు వేస్తా.

- వంశీ, బీటెక్, యాడికి

జనహితం నిజాం తత్వం

మంత్రైనా పైసా సంపాదించుకోని నిజాంవలి
కమ్యూనిస్టు నేతగా ప్రస్థానం.. కాంగ్రెస్‌నేతగా అస్తమయం



కదిరి, ఏప్రిల్ 21: ఆయన మార్గం అనన్య సామాన్యం. రాజకీయాల్లో సమున్నత స్థాయికి చేరినా ఉండటానికి ఇళ్లు, పని చేసుకోవడానికి సెంటు పొలం కూడా సంపాదించుకోని నిస్వార్థ ప్రజా సేవకుడు. ఆయనే మాజీ మంత్రి నిజాంవలి. ఎమ్మెల్యేగా 1978నుంచి 83వరకు పనిచేశారు. అదే కాలంలో మంత్రి కూడా అయ్యారు. ఆయన ప్రస్థానం కమ్యూనిస్టు పార్టీతో మూడిపడింది. కమ్యూనిస్టు పార్టీ రాజకీయాలతో ప్రభావితమైన నిజాంవలి, కదిరిలోని సామాన్య ప్రజలకు సైతం సుపరిచితం. ఎన్నో ఆటుపోట్లు, మరెన్నో ఉద్యమ నిర్బంధాలు లెక్కచేయలేదు. నవాబు వంశస్థుడైనప్పటికీ అత్యంత సామాన్య జీవితాన్ని కొనసాగించారు. భూస్వామ్య పెత్తందార్లకు వ్యతిరేకంగా సామాన్యుల పక్షాన నిలిచి వారి గొంతుకయ్యారు. విప్లవ శిఖరం ఎస్‌ఏ రవూఫ్, నిజాంవలి ఇద్దరు కదిరి రాజకీయ చరిత్రలో ఉద్యమాలను కొనసాగించారు. శాశ్వత కీర్తిని గడించారు. కమ్యూనిస్టు పార్టీలో చీలిక వచ్చిన తరువాత నిజాంవలి కాంగ్రెస్‌లో చేరారు.

కదిరా.. మాస్కోనా..! ఆశ్చర్యపోయిన నెహ్రూ

నిజాంవలి కమ్యూనిస్టు నాయకుడిగా ఉన్న సమయంలో దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కదిరి పర్యటనకు వచ్చారు. ఆ సమయంలో కరువు తాండవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ కదిరి పట్టణాన్ని ఎర్ర జెండాలతో నింపేశారు. ఎరుపు మయమైన పట్టణాన్ని చూసిన నెహ్రూ ఇది కదిరా లేదా మాస్కోనా అని పార్టీ నాయకులతో ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లు కొందరు వృద్ధ నాయకులు ఇప్పటికీ చెబుతారు. నిజాంవలి కమ్యూనిస్టు నాయకుడిగా ఉన్న సమయంలో ఆయన ఇంటిలో బంధువులు చనిపోగా శ్మశానవాటికలో స్థలం లేదని అంత్యక్రియలు చేయడానికి కొందరు నిరాకరించారు. ఆ సమయంలో కదిరి ప్రజలందరూ ముందుండి శ్మశానవాటికి ద్వారాలు తెరిచి కార్యక్రమాలు పూర్తి చేయడం ఆయన పట్ల పట్టణ ప్రజలకు ఉన్న ప్రేమకు తార్కాణమని చెబుతుంటారు. తన జీవితం కాలం అంతా సామాన్యుల అభివృద్ధి కోసం శ్రమించిన నిజాంవలి కదిరి రాజకీయ ముఖచిత్రంలో మరువలేని నాయకుడు.

ఊర్లో ఇల్లు లేదు- అడవిలో చేనులేదు

మంత్రిగా పని చేసినా నిజాంవలికి కదిరి పట్టణంలో ఇల్లు లేకపోగా, ఎక్కడేగాని సెంటు భూమి కూడా లేదు. ఆయన కుమారుడు ఎస్ఎం ముజఫర్ అలీ కదిరి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం రాజకీయాలలో క్రియాశీలకంగా లేరు. మరో కుమారుడు ఓ దినపత్రికలో విలేకరిగా కొనసాగుతున్నారు. అంతే తప్ప ఆయన పిల్లలు ఎవరూ ఉన్నతస్థాయిలో లేరు.

కోడ్ ఉల్లంఘనలపై కొరడా

109 మందిపై వేటు
రాయదుర్గంలో అత్యధికం.. కళ్యాణదుర్గంలో జీరో

అనంతపురం టౌన్, ఏప్రిల్ 21: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అధికార యంత్రాంగం కొరడా ఝుళిపిస్తోంది. షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటి వరకు 109 మందిపై కోడ్ ఉల్లంఘనలపై చర్యలు వేటు వేశారు. అనంతపురం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో వలంటీర్లు, డీలర్లు, రేషన్ సరఫరా చేసే ఎండీయూ ఆపరేటర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, రెగ్యులర్ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్‌కుమార్ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం అత్యధికంగా రాయదుర్గం నియోజకవర్గంలోనే 29 మందిపై ఉల్లంఘనల కింద వేటు వేసారు. ఇందులో వలంటీర్లు 23 మంది ఉండగా డీలర్లు నలుగురు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇద్దరు ఉన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో 19 మందిపై వేటు పడగా వీరిలో వలంటీర్లు 14 మంది, డీలర్లు ఇద్దరు, కాంట్రాక్ ఉద్యోగులు ముగ్గురు చర్యలకు గురయ్యారు. గుంతకల్లు నియోజకవర్గంలో వలంటీర్లు ఆరుగురు, డీలర్లు ఇద్దరు చొప్పున 8 మందిపై వేటు పడింది. తాడిపత్రి నియోజకవర్గంలో 24మందిపై కోడ్ ఉల్లఘించినందుకు వేటు వేశారు. ఇందులో 11మంది వలంటీర్లు, 11మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు. శింగనమల నియోజకవర్గంలో 19మందిపై చర్యలు తీసుకోగా ఇందులో 10మంది వలంటీర్లు, ఇద్దరు డీలర్లు, ఐదుగురు కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఇప్పటికి నలుగురిపై మాత్రమే చర్యలు తీసుకోగా వారిలో ముగ్గురు వలంటీర్లు ఉన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఆరుగురిపై వేటుపడగా వీరిలో వలంటీర్లు ముగ్గురు, డీలర్ ఒకరు, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇద్దరు ఉన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఇప్పటి వరకు కోడ్ ఉల్లంఘనలపై ఒక్కరిపై కూడా చర్యలు లేకపోవడం విశేషం.

సి-విజిల్‌యాప్‌కు 419 ఫిర్యాదులు.. రూ 2,95,14,352 సీజ్



ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత నిబంధనల ఉల్లంఘనలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడానికి ఎన్నికల కమిషన్ సి-విజిల్ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌కు అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 419 ఫిర్యాదులు అందాయి. ఇందులో జిల్లా కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు 159 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో రాయదుర్గం నుంచి 39, ఉరవకొండ నుంచి 25, గుంతకల్లు నుంచి 37, తాడిపత్రి నుంచి 40, శింగనమల నుంచి 3, అనంతపురంఅర్బన్ నుంచి 43, కళ్యాణదుర్గం నుంచి 50, రాప్తాడు నుంచి 23 చొప్పున సి-విజిల్ యాప్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు ఒక వ్యక్తి వద్ద రూ. 50వేలు వరకు మాత్రమే నగదు ఉండవచ్చు. అంతకన్నా ఎక్కువ నగదు తీసుకెళితే సీజ్ చేస్తారు. ఈ నిబంధనల మేరకు ఇప్పటి వరకు జిల్లాలో ప్రత్యేక బృందాల తనిఖీల్లో రూ. 2,9514,352 నగదును సీజ్ చేశారు. ఆ డబ్బుకు ఆధారాలు చూపితే వెనక్కు ఇస్తారు.




కరపత్రాలు పంపిణీ చేస్తున్న దగ్గుబాటి శ్రీలక్ష్మి, మాజీ మేయర్ స్వరూప, ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ రాజారావు

చంద్రబాబుతోనే మహిళాభ్యుదయం

కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి సతీమణి శ్రీలక్ష్మి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 21: చంద్రబాబు మహిళా పక్షపాతి అని, ఆయన సీఎం అయితేనే రాష్ట్రంలో మహిళాభ్యుదయం సాధ్యమని కూటమి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ భార్య దగ్గుబాటి శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 30వ డివిజన్‌లో ఆమె మాజీ మేయర్ స్వరూపతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ఆమె మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా ఎదగాలని మొదటి నుంచీ చంద్రబా బు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశార న్నారు. అందులో భాగంగానే ఆయన పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించారన్నారు. ఆయన ముందుచూపుతో ఆలోచించడం ద్వారా అనేక సంస్కరణలు జరిగాయన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారన్నారు. మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగే విధంగా పథకాలు అమలు చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ఆయన ముం దుకు వెళుతున్నారన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధితో పాటు అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతుందన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి దుగ్గుబాటి ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రహ మత్‌బీ, తెలుగు మహిళలు విశాలాక్షి, సునీత, శాంతి, లక్ష్మీ, సిరిలక్ష్మి పాల్గొన్నారు.

నగరంలో పలువురి ప్రచారం

అనంతపురం నగరంలోని అన్ని డివిజన్లల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు విజయశ్రీరెడ్డి, రాజారావు, కురుబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కురుబ నారాయణస్వామి, చేపల హరి, శివ, బండి లక్ష్మన్న, అనిల్, అమర్, రుద్రశేఖర్ పాల్గొన్నారు.

రాయల్ నగర్‌లో ప్రచారం

అనంతపురంరూరల్ : అనంతపురం అర్బన్ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దుగ్గుబాటి ప్రసాద్‌కు ఓటు వేసి గెలిపించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ డిష్ నాగరాజు అభ్యర్థించారు. ఆదివారం మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీ రాయల్ నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రఘునాథ్, మాజీ వైస్ సర్పంచు ఓబుళపతి, చలం తదితరులు పాల్గొన్నారు. అలాగే రుద్రంపేటలో క్లస్టర్ ఇన్‌చార్జ్ గోపాల్ గౌడ్ ప్రచారం నిర్వహించారు.



అనంతపురంలో ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ విజయశ్రీరెడ్డి



రాయల్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రకాశ్‌రెడ్డీ.. ఇక నీ హామీలను నమ్మరు

కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 21: 'ప్రకాశ్‌రెడ్డి... నీవు గత ఎన్నికల సమయంలో రాప్తాడు నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత చుక్క నీరు కూడా ఇవ్వలేదు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేశావ్. ఈ సారి ప్రజలు నిన్ను.. నీ హామీలను నమ్మే స్థితిలో లేరు... నీ ఓటమి ఖాయం..' అని రాప్తాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ప్యాదిండి, చందమూరు, చిన్నపల్లి, హరియన్‌చెరువు గ్రామాల్లో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సునీత మాట్లాడుతూ... ఈ ఐదేళ్లు టీడీపీ నాయకులు, కార్యకర్తలను తోపు సోదరులు అనేక ఇబ్బందులకు గురి చేశారని, అయినా వారు పార్టీని వీడకుండా ఉండటం అభినందనీయమని అన్నారు. అలాంటి వారికి పార్టీలో తప్పకుండా గుర్తింపు ఇస్తామన్నారు. ప్యాదిండిలో 15 కుటుంబాలు, చందమూరులో ఐదు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, రామసుబ్బమ్మ, అంకే అమరేంద్ర, ముత్యాలప్ప, అంజి, నరసింహులు, జయరామిరెడ్డి, మోహన్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి : చెన్నేకొత్తపల్లి ఎస్సీ కాలనీకి చెందిన 20 వైసీపీ కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో పరిటాల సునీత సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

ధర్మవరంరూరల్ : కనగానపల్లి పంచాయతీ, కేఎన్‌పాళ్యం నుంచి దాదాపు 40 కుటుంబాలు అనంతపురంలో పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి.

అనంతపురంరూరల్: పరిటాల శ్రీరామ్ సతీమణి జ్ఞాన మండలంలోని కక్కలపల్లి కాలనీ, నందమూరి నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకాసూర్యనారయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ ఎంపీపీ మాధవి ఇందులో పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని బీ యాలేరులో ఆదివారం టీడీపీ యువ నాయకుడు పరిటాల సిద్ధార్థ మండల నాయకులుతో కలసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, మండల ఇన్‌చార్జి బాలాజి పాల్గొన్నారు.




ప్యాదిండిలో ప్రచారం చేస్తున్న పరిటాల సునీత, నందమూరినగర్‌లో పరిటాల జ్ఞాన ఎన్నికల ప్రచారం

జనసేనలోకి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ద్రోణా

పార్టీలోకి ఆహ్వానించిన పవన్‌కల్యాణ్



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 21: వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ద్రోణా వెంకటేష్ జనసేన పార్టీలోకి చేరారు. అనంతపురం నగరానికి చెందిన ద్రోణా ఆదివారం పిఠాపురంలోని పవన్‌కళ్యాణ్ నివాసంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అధినేత పవన్‌కళ్యాణ్ వెంకటేష్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల తరుపు ప్రచారంలో పాల్గొని వారి గెలుపునకు కృషి చేయాలని పవన్‌కళ్యాణ్ సూచించినట్లు వెంకటేష్ తెలిపారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బాలుడికి చోటు



రాప్తాడు, ఏప్రిల్ 21: మండలంలోని చిన్మయ్‌నగర్‌కు చెందిన వినయ్‌కుమార్, కల్పన కుమారుడు రెయాన్ష్ ప్రభు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు సంపాదించుకున్నాడు. మూడు సంవత్సరాల పదకొండు నెలల వయసు ఉన్న రెయాన్ష్.. 20 కార్ల లోగోస్ చూసి కార్ల కంపెనీ పేర్లు చెప్పడంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ వాళ్లు మెడల్‌తో అభినందించారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించడంతో రెయాన్ష్ ప్రభును, అతని తల్లిదండ్రులను పలువురు అభినందించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం



నార్పల, ఏప్రిల్ 21: మండలంలోని గంగనపల్లి గ్రామంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధమైంది. ఆ గ్రామానికి చెందిన రైతు బల్లా జయచంద్ర రోజు లాగానే ఆదివారం తన అరటి తోటకు వెళ్లి పనులు ముగించుకొని ఇంటికి వచ్చేశాడు. అయితే ఆ అరటి చెట్లపై భాగాన ఉన్న విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగులుకొని నిప్పురవ్వలు పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి అరటి చెట్లు అన్ని ఆహుతయ్యాయి. దీంతో దాదాపు 10 ఎకరాలలో అరటి చెట్లు, డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.12లక్షలు నష్టం వాటిల్లందని బాధిత రైతు వాపోయాడు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 21: యూపీఎస్సీ పరీక్షలు ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయని డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. మొత్తం 1041 మంది అభ్యర్థులకు గాను 712 మంది హాజరు కాగా, 329 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. ఈ పరీక్షలను జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ, కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించామన్నారు. జేఎన్‌టీయులో ఉదయం 9గంటల నుంచి 11 వరకు జరిగిన పేపర్-1 పరీక్షకు 136 మందికిగాను 54 మంది పరీక్షకు హాజరుకాగా 82 మంది గైర్హాజరయ్యారన్నారు. 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన జనరల్ నాలెడ్జ్ పరీక్షకు 136 మందికి గాను 54 మంది హాజరుకాగా 82 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పేపర్-3 మ్యాథ్‌మేటిక్ పరీక్షకు 66 మందికి గాను 28 మంది హాజరుకాగా 38 మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగిన పేపర్-1 మ్యాథ్‌మేటిక్ పరీక్షకు 187మందికి గాను 123మంది హాజరుకాగా 64 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు జరిగిన పేపర్-2 జనరల్ పరీక్షకు 187 మందికి గాను 124 మంది హాజరుకాగా 124మంది గైర్హాజరైనట్లు వివరించారు.

1 నుంచి అథ్లెటిక్ సమ్మర్ కోచింగ్ క్యాంపు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 21: వేసవి అథ్లెటిక్ శిక్షణా శిబిరం మే 1 నుంచి నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహిస్తున్నట్లు శాప్ అథ్లెటిక్ కోచ్ మంజుల తెలిపారు. 8-30 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన అథ్లెటిక్ క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు పేర్ల నమోదుకు, మరిన్ని వివరాలకు 72073 84486ను సంప్రదించాలని కోరారు.

మద్యం బాటిళ్ల సీజ్

శింగనమల : మండలంలో ఆకులేడులో మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఆ వ్యక్తి వద్ద ఉన్న 23 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నంది వాహనంపై సంగమేశ్వరుడు

కూడేరు, ఏప్రిల్ 21: జోడులింగాల సంగమేశ్వర స్వామి ఆదివారం కమ్మవారి సంఘం ఆధ్వర్యంలో నంది వాహనంపై విహరించారు. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజున ఆలయంలో అర్చకులు స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి సమయంలో స్వామి వారు ఊరేగించే నంది వాహనాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం సతీ సమేతంగా స్వామివారు మాడవీధుల్లో ఊరేగించారు.

కోటి కష్టాలు

- రూ. కోటితో హౌసింగ్ బోర్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు
- కంకరవేసి వదిలేసిన వైనం.. ప్రజలకు తప్పని పాట్లు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 21: ఇంజనీరింగ్ అధికారుల అలసత్వం... కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ప్రజల పాలిట శాపంగా మారింది. నగరపాలిక పరిధి హౌసింగ్‌బోర్డులో నగరంలోని అతి పెద్ద పార్కు రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ ఎదుట రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను రూ. కోటితో చేపట్టారు. రోడ్డు విస్తరణ, పేపర్ బ్లాక్స్‌తో 400 మీటర్ల మేర ఈ రహదారి నిర్మాణ పనులు నిర్మించాల్సి ఉంది. దాదాపు 50 రోజుల క్రితం ప్రారంభమైన ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. తొలుత రోడ్డుకు ఇరువైపులా మట్టి తీశారు. ఆ సమయంలోనూ ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులు దాటాక రోడ్డుకు ఇరువైపులా కంకర వేశారు. తాజాగా రోడ్డు మొత్తం కంకర వేశారు. దీంతో ఆ దారిలో వెళ్లడానికి వాహనదారులు, పాదచారులు జంకుతున్నారు. ఉదయం, సాయంత్రం పార్కుకు వెళ్లే వారు వాహనాలు పార్క్ చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ముందే ఈ వర్క్‌కు అనుమతి వచ్చినా నేటికీ పూర్తి కాకపోవడం గమనార్హం. ఈ విషయంపై ఏఈ బాబావలి వివరణ కోరగా... రోలింగ్ చేస్తున్నామని, మరో 15 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని తెలిపారు.



కంకర వేసి వదిలేసిన రోడ్డు

వైసీపీ ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్, వలంటీర్

శింగనమల, ఏప్రిల్ 21: మండలంలో సోదనపల్లి గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులు, పార్లమెంట్ అభ్యర్థి శంకర్‌నారాయణ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో ఎన్నికల నింబంధనలకు విరుద్ధంగా సోదనపల్లి గ్రామానికి చెందిన ఎండీయూ ఆపరేటర్ మల్లికార్జున, వలంటీర్లు నాగలక్ష్మి పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు.




వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఎండీయూ ఆపరేటర్ మల్లికార్జున, వలంటీర్ నాగలక్ష్మి

భక్తిశ్రద్ధలతో మహవీర్ జయంతి



వెండిరథంలో మహవీర్ స్వామిని ఊరేగిస్తున్న మార్వాడీలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 21 : స్థానిక పాతూరు, కమలానగర్ ప్రాంతాల్లో మహవీర్ జయంతిని మార్వాడీలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాతూరు, కమలానగర్‌లోని మహవీర్‌స్వామి దేవాలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాలాలు, డప్పు వాయిద్యాల నడుమ మహవీర్ స్వామి చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. తదనంతరం మార్వాడీలు నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు.

రోడ్డుకు అడ్డంగా ఇసుక, వాహనాలు

ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు, పాదచారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 21 : స్థానిక అశోక్‌నగర్‌లో ఆంధ్రాబ్యాంకు (యూనియన్‌బ్యాంకు)కు ఖాతాదారుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆ బ్యాంకు ఎదురుగా ఉన్న ఓ దుకాణం ముందు దాని యజమాని ఇసుక నిల్వ ఉంచాడు. దీంతో ఆ దుకాణానికి, బ్యాంక్‌కు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపైనే ఉంచుకున్నారు. జేఎన్‌టీయూ, శారదానగర్, హౌసింగ్‌బోర్డు, కలెక్టరేట్, అశోక్‌నగర్, బుడ్డప్పనగర్ నుంచి నగరంలోకి రావడానికి ఇదే ప్రధాన రహదారి. దీంతో అటుగా వెళ్లే వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు కూడా జరిగాయి. ఇసుకను తొలగించాలని ఆ దుకాణాదా రుడికి పలుమార్లు సూచించినా పట్టించుకో వడం లేదని అటు బ్యాంకర్లు, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు, పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



దుకాణం ఎదురుగా రోడ్డుపై వేసిన ఇసుక



ఆంధ్రాబ్యాంకు ఎదురుగా రోడ్డుకు అడ్డంగా ఉంచిన వాహనాలు

సన్‌డే

ఎండలు మండిపోతున్నాయ్. పది రోజులుగా 40 డిగ్రీల నుంచి 43 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు ప్రజలకు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.50 గంటల వరకూ మండే ఎండలు బాధిస్తుంటే.... ఒకవైపు... సాయంత్రం నుంచి తెల్లవారుజామున వరకూ ఉక్కపోతలు ప్రజలకు ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి. ప్రజలు ఉదయం బయటకు వచ్చారంటే...... పరుగులు తియ్యాల్సిందే. తలపై టోపీ లేదా, కొంగు, పైట ఏది ఉంటే అది వేసుకోకుంటే... మాడ పగలగొట్టేస్తుంది. ఇక చిన్న పిల్లలు ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. చల్లదనం కోసం మజ్జిగ, తాటి ముంజలు, కళింగ తదితర పండ్ల కోసం ప్రజలు ఎగపడుతున్నారు. ఆదివారం భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. ఆంధ్రజ్యోతి కెమరాకు దొరికి ఆ ఎండల వల్ల ప్రజలు పడుతున్న కష్టాలు చూస్తుంటే... వామ్మో ఈ 'సన్'డేలు ఇంకెన్ని రోజులో అనకమానరు.

– అనంతపురం విద్య



అమ్మ చల్లని నీడలో..



త్వరగా ఇంటికి చేరుకుంటే చాలు






పేదోడి ఫ్రిడ్జ్‌లకు డిమాండ్..: హమ్మయ్య... ఇక రోజూ చల్లని నీళ్లు తాగొచ్చు...




చల్లటి సేవ..

కేఎస్‌ఆర్ కళాశాల వద్ద ప్రజలకు సత్యసాయి భక్తుల మజ్జిగ వితరణ

జాతీయ అకాడమీకి ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 21: జాతీయ క్రీడా అకాడమీకి జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఏలూరులోని జాతీయ క్రీడా అకాడమీ (సాయి)కి జిల్లాకు చెందిన మణికంఠ, భరత్ అర్హత సాధించారని డీఎస్‌డీఓ షఫీ, కోచ్ మంజుల తెలిపారు. పీటీసీలో శిక్షణ తీసుకుంటున్న వీరు సాయి అకాడమీలో ప్రవేశం పొందడం ఆనందంగా ఉందని అభినందించారు.



భరత్, మణికంఠ

గరుడవాహనంపై ఊరేగిన శ్రీరాముడు



అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 21 : శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన ఆదివారం మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో రాములవారు గరుడవాహనంపై వెంకటేశ్వరస్వామి అలకరణలో ఊరేగుతూ దర్శనమిచ్చారు. ఉదయం సీతారాములకు వివిధ అభిషేకాలు, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం వెంకటేశ్వర స్వామిగా అలంకరించి గరుడవాహనంపై పురవీధులగుండా ఊరేగించారు. అనంత రం ఆలయ ఆవరణంలోని వేదికపై ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాపకుడు, విశ్రాంత తహసీల్దార్ పాలసముద్రం నాగరాజు నేతృత్వంలో గాయనీ గాయకులు భక్తిపాటలు ఆలపించారు.



భక్తిగీతాలు ఆలపిస్తున్న కళాకారులు

నేడు క్రిష్ణంరెడ్డిపల్లిలో పరిటాల ప్రచారం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 21: మండలంలోని క్రిష్ణంరెడ్డిలో మాజీ మంత్రి పరిటాల సునీత సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు క్రిష్ణంరెడ్డిపల్లి నుంచి చియ్యేడు, పూలకుంట, ఇటుకలపల్లి మీదుగా చిన్నకుంట వరకు ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.40 లక్షలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 21: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3,40,920 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,60,420, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,80,500 వచ్చిందని తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

రాప్తాడు : మండలంలోని పాల బావి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, స్టోర్ మాజీ డీలర్ రామాంజినేయులు శనివారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న పరిటాల సునీత ఆదివారం ఉదయం ఆ గ్రామానికి వెళ్లి రామాంజినేయులు మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేశారు. అనంతరం గ్రామంలో ఇటీవలే మరణించిన నారాయణ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, పసుపుల బాబయ్య పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు..

శింగనమల: మండలంలోని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లిశెట్టి శంకర్ (76) ఆదివారం మరణించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్వగృహంలోనే మరణించారు. ఆయన మృతికి పార్టీ నాయకులు భాస్కర్, కుమ్మెత చంద్రశేఖర్ సంతాపం వ్యక్తం చేశారు.

మోదీ గోబెల్స్ ప్రచారం మానుకోవాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్


మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 21: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీఏకు 400 సీట్లు వస్తాయని ప్రధాన మంత్రి మోదీ గోబెల్స్ ప్రచారం చేయడం మానుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డీ జగదీష్ హితవు పలికారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీకి 30 రాష్ట్రాలలో కేవలం 8 రాష్ట్రాలలో స్పష్టమైన మెజార్టీ ఉందన్నారు. పది రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతో కలసి పనిచేస్తున్నాయని అన్నారు. మరో పది రాష్ట్రాల్లో బీజేపీ లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 400 స్థానాలు గెలవడం అసాధ్యమన్నారు. ఎన్డీఏకు 150-200 సీట్లు వస్తాయని సర్వేలన్నీ చెబుతున్నాయన్నారు. దేశంలో బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయన్నారు. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల బోర్లు ఎండిపోయి, భూగర్భజలాలు అడుగంటి పోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. అనంతపురం జిల్లాలోని గుత్తి పట్టణంలో తాగునీటి ఎద్దడి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే ప్రజా సమస్యలపై ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ గోవిందు, నియోజవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రాము పాల్గొన్నారు.

వంద కుటుంబాలు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరినవారితో నారాయణస్వామి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 21: పట్టణంలోని మహబూబ్ నగర్ కాలనీలో వైసీపీ నుంచి వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఆదివారం ఆ కాలనీలో ప్రజాగళం కార్యక్రమాన్ని టీడీపీ అభ్యర్థి జయరాం సోదరుడు నారాయణ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. వైసీపీ నుంచి వడ్డెఆదినారాయణ, చాకలివెంకటేశ్వర్లు, చిన్ని, అబ్దుల్, రహిమాన్, సిల్వర్‌మస్తాన్, గౌస్‌పీర్, బురుజుల బాషా, కురుబ మస్తానయ్యతో పాటు 91 కుటుంబాలకు ఆయన టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, నాయకులు గుమ్మనూరు గోవిందు, రవికుమార్ పాల్గొన్నారు.

వైసీపీ ఖాళీ.. టీడీపీ హౌస్‌ఫుల్..!


పార్టీలో చేరిన వారితో గుమ్మనూర్ ఈశ్వర్

పామిడి ఏప్రీల్ 21: మండలంలో వైసీపీ ఖాళీ టీడీపీ హౌస్‌ఫుల్ అని గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ అన్నారు. పట్టణంలోని అంబా భవాని ఆలయంలో ఆదివారం భావసార క్షత్రియుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... గుంతకల్లు నియోజకవర్గం కూటమి అభ్యర్థిగా జయరాంను నియమించగానే వైసీపీ నుంచి భారీగా వలసలు ప్రారంభమయ్యాయన్నారు. మంజునాథ్ రావు ఆధ్వర్యంలో రమేష్. నాగేంద్ర, హవన్న, మంజు, ప్రవీణ్, రత్నాభాయ్ టీడీపీలోకి చేరారు.

50 మంది టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వారితో జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 21: మండలంలోని భోగసముద్రం గ్రామానికి చెందిన 50మంది వైసీపీ మద్దతుదారులు ఆదివారం మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సుధాకర్‌తోపాటు పలువురు ఉన్నారు.

గన్నెవారిపల్లిలో విస్తృత ప్రచారం: మండలంలోని గన్నెవారిపల్లిలో ఆదివారం టీడీపీ తరపున చింబిలి ప్రసాద్‌నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి కూటమి అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. లింగం కృష్ణ, రాము, రవీంద్రనాయుడు, నాయుడు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి 101టెంకాయలు: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి అఖండ మెజార్టీతో గెలవాలని ఆదివారం ఆయన అభిమానులు స్థానిక అశోకపిల్లర్ సమీపంలో ఉన్న అభయాంజనేయస్వామికి 101 టెంకాయలు కొట్టారు. స్వామివారికి అర్చనలు చేయించి పూజలు నిర్వహించారు. పూజల్లో గండికోట కార్తీక్, హేమంత్, రామచంద్ర, శివ పాల్గొన్నారు.

నంది వాహనంపై సంగమేశ్వరుడు


నంది వాహనంపై విహరిస్తున్న స్వామివారు

కూడేరు, ఏప్రిల్ 21: జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆదివారం కమ్మవారి సంఘం ఆధ్వర్యంలో నంది వాహనంపై విహరించారు. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజున ఆలయంలో అర్చకులు స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి సమయంలో స్వామి వారు ఊరేగించే నంది వాహనాన్ని వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం సతీ సమేతంగా స్వామివారు మాడవీధుల్లో ఊరేగింపు చేయగా భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

త్రివిక్రమ అలంకరణలో శ్రీరాముడు


అలంకరణలో పట్టాభిరాముడు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 21: పట్టణంలోని ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టాభిరాముడు త్రివిక్రమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

కన్నులపండువగా జంబుకేశ్వరస్వామి కల్యాణం

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 21: పట్టణంలోని కోటలో వెలసిన జంబుకేశ్వరస్వామి కల్యాణం ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారికి చక్రస్నానం, కుంకుమార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు వేదపండితుల మంత్రోచ్చారణ లు, వేలాదిమంది భక్తుల నడుమ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ముత్యాలపల్లకిని ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

పుట్లూరు, ఏప్రిల్ 21: మండలంలోని కొండుగారికుంట గ్రామంలో 22, 23, 24తేదీల్లో పెద్దమ్మ, అంకాలమ్మ అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆదివారం గ్రామపెద్దలు తెలిపారు. అమ్మవార్ల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవార్లకు బోనాలు సమర్పించనున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

బెంగళూరులో ఉండే నాయకుడు అవసరమా?

● మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు


రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న కాలవ శ్రీనివాసులు

గుమ్మఘట్ట, ఏప్రిల్ 21: బెంగళూరులో వ్యాపారాలు చేస్తూ చుట్టపు చూపుగా నియోజకవర్గానికి వచ్చే మెట్టు గోవిందరెడ్డి అవసరమా అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బేలోడు గ్రామంలో ఆదివారం సాయంత్రం టీడీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన కాలవ శ్రీనివాసులుకు మహిళలు హారతులతో ఘనస్వాగతం పలికారు. యువనాయకుడు సంజీవ కాలవ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలవర్షం కురిపించారు. కాలవ మాట్లాడుతూ 11 ఏళ్ల పదవి అనుభవించిన మెట్టు గోవిందరెడ్డి రాయదుర్గం నియోజకవర్గానికి ఏ ఒక్క అభివృద్ధి చేశాడా అని విమర్శలు గుప్పించారు. జనసేన తాలూకా అధ్యక్షుడు మంజునాథగౌడ్, బీజేపీ వసుంధర, పాటిల్ అజయ్‌కుమార్‌రెడ్డి, గిరిమల్లప్ప, కాలవ సన్నన్న పాల్గొన్నారు.

40 మైనార్టీ కుటుంబాల చేరిక

రాయదుర్గం: పట్టణంలోని మొలకాల్మూరోడ్డు ప్రాంతంలో నివాసముండే 40 మైనార్టీ కుటుంబాలు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. పట్టణానికి చెందిన ఫయాజుల్లా, రఫియా అహ్మద్, ఇద్రిస్‌బాషా, అబ్దుల్ అజీజ్, జాఫర్, మహ్మద్ గౌస్, రసూల్, అబ్దుల్, సిద్ధిక్‌లతో పాటు మరి కొన్ని కుటుంబాలు టీడీపీలో చేరాయి. మాజీ కౌన్సిలర్ టంకశాల హనుమంతు, బంగి రామకృష్ణ పాల్గొన్నారు.


మురడి ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న కాలవ దంపతులు

దేవుడి ఆశీస్సులు కూడా టీడీపీకే..

డీ.హీరేహాళ్: రాష్ట్రవ్యాప్తంగా ప్రజల కోరిక మేరకు దేవుడి ఆశీస్సులతో ఈసారి తెలుగుదేశం పార్టీ గెలుపు ఖాయమని కాలవ శ్రీనివాసులు అన్నారు. ఈ నెల 24వ తేదీన ఎమ్మెల్యే అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులు నామినేషన్ దాఖలు చేయడం కోసం ముహూర్తం ఖరారు చేశారు. ఈ సందర్భంగా ప్రసిద్ధిగాంచిన మురడి ఆంజనేయస్వామి ఆలయంలో కుటుంబసమేతంగా కాలవ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు గంగాధర, మల్లికార్జున పాల్గొన్నారు.

నవరత్నాల పేరుతో జగన్ వంచన

బొమ్మనహాళ్ జగన్‌రెడ్డి నవరత్నాల పేరుతో జనాన్ని వంచించారని కాలవ శ్రీనివాసులు కుమార్తె గౌతమి ఆరోపించారు. మండలంలోని కళ్లదేవనహళ్లి, తారకాపురం గ్రామాలలో కాలవ శ్రీనివాసులు గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేపట్టారు. మే 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ మండల కన్వీనర్ బలరాం రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమ్మరి మల్లికార్జున, ఎర్రగుంట్ల వెంకటేశులు, ముల్లంగి నారాయణస్వామి, మహేంద్ర, పయ్యావుల అనిల్, పయ్యావుల నాగరాజు, మాలపాటి ధనుంజయ పాల్గొన్నారు.

అమిలినేని కుటుంబం పల్లె బాట.. విస్తృత ప్రచారం


వృద్ధురాలికి కరపత్రాన్ని అందజేస్తున్న అమిలినేని కోడలు ఇషిత


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అమిలినేని కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 21 : టీడీపీ గెలుపే ధ్యేయంగా ఎన్నికల ప్రచారంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు దూసుకెళుతున్నారు. అందులో భాగంగా ఆదివారం కంబదూరు మండలంలోని తిప్పేపల్లి, నూతిమడుగు, గూళ్యం, రాంపురం, వైసీ పల్లి, సీవీ తండా గ్రామాల్లో అమిలినేని సురేంద్రబాబు భార్య రమాదేవి, సోదరి రాధామాధవి, కోడలు ఇషితతో కలసి ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. వైసీపీ పాలనలో గ్రామాలలో కనీస వసతులు కూడా కల్పించకుండా అధ్వానస్థితికి చేరుకున్నాయన్నారు. తాగునీరు, వీధి బల్బులు కూడా వేయించకుండా వున్నారంటే గ్రామాల్లో వైసీపీ పాలన ఏవిధంగా వుందో అర్థమవుతుందన్నారు. అస్తవ్యస్తంగా డ్రైనేజీ, సీసీ రోడ్లు వున్న గ్రామాలే ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయన్నారు. మనమందరం ఒక్కటిగా వుంటూ టీడీపీ గెలుపునకు అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడవాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యమన్నారు. నేడు ఏ గ్రామంలో చూసినా టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఆ ప్రజాబలంతోనే కళ్యాణదుర్గంలో టీడీపీ అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి: బీజేపీ

కళ్యాణదుర్గంరూరల్: ఎన్డీఏ కూటమి బలపరిచిన అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు ఓటు వేసి గెలిపించాలని బీజేపీ నాయకులు ఆదివారం ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని విట్లంపల్లి, హులికల్లు, మల్లికార్జునపల్లి తదితర గ్రామాలలో సురేంద్రబాబు తరపున విస్తృత ప్రచారం చేశారు. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బంగారు మల్లారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ముప్పూరి దేవరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, కోకన్వీనర్ గంగాధర్, నాయకులు సుధాకర్, చెక్కా సుబ్రహ్మణ్యం, చక్రవర్తి, రవి, తిప్పేస్వామి, వేణు, జనసేన కార్తీక్, పాల్గొన్నారు.


ఓట్లను అభ్యర్థిస్తున్న బీజేపీ, టీడీపీ నాయకులు

ఆలయ నిర్మాణానికి టీడీపీ నాయకుడి విరాళం


విరాళాన్ని అందిస్తున్న టీడీపీ నాయకుడు

కణేకల్లు, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని రామ్‌నగర్‌లో సీతరామ ఆలయ నిర్మాణానికి టీడీపీ నాయకుడు వేలూరు మరియప్ప రూ.51 వేలును విరాళంగా అందించారు. ఆదివారం మరియప్ప నివాసంలో సీతరామ ఆలయ నిర్వాహకుడు తిప్పేస్వామికి తన భార్య వేలూరు మధుమతితో కలిసి ఆయన అందజేశారు.

జర్నలిస్ట్ కుమార్తెకు రూ.27 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం


విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 21: వాల్‌మార్ట్ కొడెహెర్స్ ఇంటర్న్‌షిప్‌లో రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినికి రూ. 27 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం లభించింది. కళ్యాణదుర్గానికి చెందిన ఫొటోగ్రాఫర్, జర్నలిస్టు గొల్ల గోవిందరాజులు, శ్రీలత దంపతుల కుమార్తె హరిప్రియ రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ చదువుతున్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తయిన తరువాత యేడాదికి రూ.27 లక్షల ప్యాకేజీతో ఉద్యోగంలో చేర్చుకున్నారు.

జేసీ పవన్‌రెడ్డిపై కేసు నమోదు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 21: టీడీపీ నేత జేసీ పవన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం పట్టణ పోలీసులు తెలిపారు. ఈనెల 19న టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పవన్‌రెడ్డి యువత రెండు దొంగ ఓట్లు వేసి అయినా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఎంసీసీ టీం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాంమోహన్ ఫిర్యాదు మేరకు పవన్‌రెడ్డిపై కేసు నమోదుచేశామని తెలిపారు.

'బాబును మళ్లీ రప్పిద్దాం'లో పాల్గొన్న నాయకులు


కార్యక్రమంలో పాల్గొన్న గుంతకల్లు నియోజకవర్గ నాయకులు

గుత్తి, ఏప్రిల్ 21: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన బాబును మళ్లీ రప్పిద్దాం కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు. యూత్ నాయకులు రవి, మంజురెడ్డి, ఎస్టీసెల్ పార్లమెంట్ అధ్యక్షుడు రమేష్‌నాయక్, ఐటీడీపీ అధ్యక్షుడు ఆవుల శివ, లింగరాజు యాదవ్, పునిత్, ఆమ్లెట్ మోహన్ యాదవ్, గంగాధర్, అనిల్‌కుమార్ మహేష్ పాల్గొన్నారు.

దోచుకున్నోడికి దోచుకున్నంత !

● పామిడి పెన్నాలో యథేచ్ఛగా ఇసుక దోపిడీ
● భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతుల ఆందోళన


పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్లు

పామిడి, ఏప్రిల్ 21: అక్రమార్జనే ధ్యేయంగా పెట్టుకున్న ఇతర నియోజకవర్గాల అధికార పార్టీ నాయకులు పామిడి పెన్నానది నుంచి ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నారు. పామిడి పెన్నానది వైసీపీ నాయకుల ఆదాయానికి కల్పతరువుగా మారింది. పామిడి పెన్నానది శివారు ప్రాంతంలో ఇసుకను యథేచ్ఛగా టిప్పర్ల ద్వారా కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు సోలార్ ప్రాజెక్టు, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. అనుమతులు లేకుండా వారం రోజులపాటు రాత్రింబవళ్లు ఇసుకను తరలించి వైసీపీ నాయకులు పెద్ద మొత్తంలోనే సొమ్ము చేసుకున్నట్లు సమాచారం. పెన్నానది లోపలికి ఎవరూ రాకుండా పహారా ఉంచడంతో చుట్టుపక్కల రైతులు అభ్యంతరం చెప్పేందుకు భయపడ్డారు. నదిలో ఇసుక లోడింగ్ ఎవరికీ కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం. అధికలోడ్‌తో ఇసుక టిప్పర్లు తిరిగితే తమ గ్రామానికి వేసిన తారు రోడ్డు ఛిద్రమవుతుందని కొండూరు గ్రామస్థులు రవాణాకు అడ్డు తగిలారు. దీంతో అక్రమ రవాణా ఆలస్యంగా వెలుగుచూసింది. అప్పటికే సుమారు రూ. 70 నుంచి 80లక్షల విలువ గల ఇసుక తరలించేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు టిప్పర్లు, ఒక హిటాచి వాహనంను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఇసుకను ఇలాగే తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటి తమ బోరుబావులు ఎండిపోతాయని, రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సామాన్యులు తమ సొంత అవసరాలకు ఇసుకను తరలిస్తే సవాలక్ష ప్రశ్నలతో వేధించే పోలీసులు అక్రమంగా భారీ స్థాయిలో తరలిస్తుంటే ఏం చేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు.

అనుమతులు లేవు: రాజశేఖర్‌రెడ్డి, సీఐ, పామిడి.

పామిడి పెన్నానది నుంచి ఇసుకను తరలించేందుకు ఎవరికీ అనుమతులు లేవు. గతంలోనూ ఓ టిప్పర్‌ను అదుపులోకి తీసుకొని గనులు, భూగర్భ శాఖాధికారులకు అప్పగించాం. ఇసుక అక్రమ రవాణా చేపట్టడం చట్టరీత్యానేరం. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన మూడు టిప్పర్లను అదుపులోకి తీసుకొని గనులు భూగర్భ శాఖకు అప్పగించాం. ఇసుక అక్రమ రవాణా చేపడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు.

శాంతియుత ఎన్నికలే లక్ష్యం: డీఎస్పీ

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 21: గొడవలు, అల్లర్లులేని శాంతియుత ఎన్నికలే తమ లక్ష్యమని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం శెట్టూరు మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన శెట్టూరు, చిన్నంపల్లి, లక్ష్మంపల్లి, చింతర్లపల్లి, పెరుగుపాల్యం, ములకలేడు తదితర గ్రామాలలో ఫ్లాగ్‌మార్చ్ చేసి కవాతు నిర్వహించారు. సీఐ ఎస్వీ నాగరాజు, ఎస్ఐ రాంభూపాల్, బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుమిత్ కుమార్ శర్మ, సబ్ ఇన్‌స్పెక్టర్లు మనోజ్ కుమార్, రాజన్ త్యాగి, కుల్దీప్ సింగ్ రాథోడ్, 75 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


శెట్టూరులో ప్రజలకు సూచనలిస్తున్న పోలీసులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆంథోని కాలనీలో ఆదివారం సాయంత్రం డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫుట్‌మార్చ్ నిర్వహించారు. కాలనీ ప్రజలతో డీఎస్పీ సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలన్నారు. గొడవలు, అల్లర్లకు దూరంగా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. వన్‌టౌన్, టూటౌన్ సీఐలు రామసుబ్బయ్య, గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని అందుకు కావాల్సిన రక్షణ కల్పిస్తామని డీఎస్పీ శివారెడ్డి వెన్నపూసపల్లి ప్రజలకు తెలిపారు. ఆదివారం సాయంత్రం వెన్నపూసపల్లి, నిట్టూరు గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటుచేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని సూచించారు. గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ గిరిబాబు ఉన్నారు.

నీళ్లు ఇవ్వలేని అసమర్థుడు విశ్వేశ్వరరెడ్డి

● టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కేశవ్


రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉరవకొండ, ఏప్రిల్ 21: హంద్రీనీవా ప్రధాన కాలువల నుంచి చెరువులకు నీళ్లు ఇచ్చేందుకు కాలువలు తవ్వించినా నీళ్లు ఇవ్వలేని అసమర్థుడు విశ్వేశ్వరరెడ్డి అని టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. వజ్రకరూరు మండలంలోని వీసీ ప్యాపిలీ కడమలకుంట, రాగులపాడు, వెంకటాంపల్లి పెద్ద తండా, పందికుంట, ఎన్ఎన్‌పీ తండాలలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయాగ్రామాల్లో రోడ్‌షో చేపట్టారు. టీడీపీ అభ్యర్థికి మహిళలు హారతులతో ఘనస్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, త్వరలోనే వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధమైయ్యారన్నారు. సంక్షేమం పేరిట వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. నిధులేమో కేంద్రానివి, స్టిక్కర్లేమో వైసీపీవి వేసుకుని ప్రచారం చేసుకుంటుందన్నారు. కేంద్రం నిధులిస్తే తప్పా సంక్షేమపథకాలు అమలు కావన్నారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయ్యిందన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో మన భూములను కాజేందుకు ప్రభుత్వం కుట్రపన్నిందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు సంబంధించిన 27 పథకాలను రద్దు చేశారన్నారు. జగన్ బటన్ నొక్కాడని, విశ్వేశ్వరరెడ్డి ఐదేళ్లలో నియోజకవర్గానికి ఏం చేశాడో సమాధానం చెప్పి ఓట్లు అడగాలన్నాడు. హంద్రీనీవా నుంచి డిస్ట్రిబ్యూటరీలకు నీళ్లు ఇస్తే రైతుల జీవితాలు బాగుపడతాయన్నారు. కాలువకు నీళ్లు రావని రైతులను నాశనం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసమే కూటమి కలయికన్నారు. మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, కూటమి నాయకులు లక్ష్మీనారాయణ, సురేంద్ర, కేశవులు, నాయకులు తట్రగల్లు సుధాకర్, నాగేంద్ర, నాగన్న, ధనుంజయ, ప్రశాంత్, సర్పంచ్ సుదీప్, ప్రభాకర్, తులసీదాస్‌నాయక్, మాజీ ఎంపీపీ వెంకటమ్మ, సుధాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం: వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి పెద్ద తండా, ఎన్ఎన్‌సీ తండాలలో బంజారాలు కేశవ్‌కు ఘనస్వాగతం పలికారు. బంజారా సంప్రదాయ వేషధారణ అయిన తలపాగా, సల్వార్‌ను అందజేసి సత్కరించారు. కేశవ్‌నాయక్, మహేష్‌నాయక్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతోనే పేదల అభివృద్ధి


సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న విజయ్‌సింహా

విడపనకల్లు: టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో పేదల అభివృద్ధి సాధ్యమవుతుందని పయ్యావుల కేశవ్ కుమారుడు విజయసింహా అన్నారు. మండలంలోని పెద్ద కొట్టాల పల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీకి ఓటు వేసి పయ్యావుల కేశవ్‌ను గెలిపించాలని, చంద్రబాబు నాయుడును సీఎంను చేయాలని ఓటర్లను అభ్యర్థించారు. రవీంద్ర, రంగనాయకులు, ఓబులనాయుడు, లోకేశ్, మంజూ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 21: మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన ప్రకాష్(38) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు ప్రకాష్‌కు అదే గ్రామానికి చెందిన మల్లమ్మతో 10 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మద్యానికి బానిసైన ప్రకాష్ తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడని, దీంతో విసుగు చెందిన భార్య కొన్ని రోజులు తనకు దూరంగా ఉంటేనైనా మారతాడని రెండురోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ సమయంలో మల్లమ్మ వద్దకు వెళ్లి ఇంటికి రావాలని ప్రకాష్ పిలవగా ఆమె రానని చెప్పినది. దీంతో మనస్థాపానికి గురైన ప్రకాష్ నేరుగా ఇంట్లో వెళ్లి సీలింగ్‌రాడ్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంతసేపటికి ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వారు తలుపులు బద్ధలు కొట్టి చూడగా ఇంట్లో ఉరికి వేలాడుతుండడం గమనించారు. వెంటనే అతనిని కిందకు దించి చూడగా అప్పటికే మరణించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని భార్య మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎలుగుబంటి సంచారం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 21: మండలంలోని చంద్రగిరి గ్రామ శివార్లలో ఎలుగుబంటి ఆదివారం సంచరించింది. బొల్లనగుడ్డం గ్రామం నుంచి ఎలుగుబంటి వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. మధ్యాహ్నం 11 గంటల సమయంలోనే గ్రామశివారులో ఎలుగుబంటి సంచరించినట్లు గుర్తించారు. దీంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. గ్రామశివారులలో సంచరించే ఎలుగుబంటిని చూసి గ్రామస్థులు చూసి ఈలలు, కేకలు వేయడంతో చెట్టు ఎక్కేసింది. అటవీశాఖ అధికారులకు గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని చెట్టుపైన ఉన్న ఎలుగుబంటిని గమనించి కిందకు దించేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు, చివరకు చెట్టును నరకడంతో కిందకు వచ్చిన ఎలుగుబంటిని అటవీశాఖ అధికారులు, గ్రామస్థులు ఎత్తినబూదాళ్ వైపు తరిమారు.

జ్వరంతో చిన్నారి మృతి


ప్రణయ్(ఫైల్)

పెద్దవడుగూరు, ఏప్రిల్ 21: మండలంలోని చిత్రచేడు గ్రామానికి చెందిన చలపతి కుమారుడు ప్రణయ్ (2) తీవ్ర జ్వరంతో శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. తండ్రి తెలిపిన మేరకు రెండురోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న చిన్నారిని మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించాడు. శనివారం అర్ధరాత్రి సమయంలో పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 21: పుట్లూరు మండలంలోని శనగలగూడూరు గ్రామంలో 17వ తేదీన నాగేంద్ర, నారాయణరెడ్డిలు ఇరువురు గొడవపడిన విషయంలో ఆదివారం కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. స్థానిక హోటల్ వద్ద ఒక విషయంపై మాట మాట పెరిగి వాదించుకున్నారన్నారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నేడు టీడీపీ ప్రచారం

బెళుగుప్ప, ఏప్రిల్ 21: మండల కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయులు విక్రమ్ సింహా, విజయ్ సింహా ప్రచారం చేస్తున్నట్లు టీడీపీ స్థానిక నాయకులు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వన్నూరుస్వామి, పెద్దతిప్పయ్య, మల్లికార్జున, కంచి రాముడు, వెంకటరామిరెడ్డి కోరారు.